


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 113, పేజీలు - 08

ఆదివారం, సెప్టెంబర్ 28, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



## విద్యార్థులకు రూ.2 వేల స్కాలర్‌షిప్

### ఏటీసీ కేంద్రాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

- సాఫ్ట్‌వేర్ కోర్సులతోనే విదేశాల్లో ఉద్యోగాలు వస్తాయని అనుకోవద్దని వ్యాఖ్య
- విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యాలు అవసరమన్న ముఖ్యమంత్రి
- అవసరమైన స్కిల్స్ యువతలో లేవని పరిశ్రమలు చెబుతున్నాయని వ్యాఖ్య
- 116 ఏటీసీలను ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ ప్రకటన
- ఏటీసీల్లో చేరే విద్యార్థులకు నెలకు రూ.2 వేలు స్కాలర్‌షిప్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో రాష్ట్ర యువత భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీసీల్లో విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు. అలాగే ప్రతీ విద్యార్థికి నెలకు రూ.2,000 స్కాలర్‌షిప్ అందించేలా ఆర్థిక మంత్రిని ఒప్పిస్తానని శుభవార్త చెప్పారు. వచ్చే ఏడాది నుంచి విద్యార్థులకు రూ.2 వేల స్కాలర్‌షిప్ అందించే దిశగా చర్యలు తీసుకుంటాం అన్నారు.

#### అందుకే ఐటీఐలు నిర్వీర్యం అయ్యాయి..

ఏటీసీ సెంటర్లు ప్రారంభించిన తరువాత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..



## దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్

### - ప్రారంభించిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వదేశీ 4జీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చింది. శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. పూర్తి భారతీయ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ 'భారత్ టెలికాం స్టాక్' నెట్‌వర్క్‌ను జాతికి అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టం ద్వారా టెలికాం రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం దిశగా దేశం ఒక కీలక మైలురాయిని అధిగమించింది. ఈ కార్యక్రమంలో భాగంగా, సుమారు రూ.37,000 కోట్ల వ్యయంతో, సౌరశక్తితో పనిచేసే

2లో..

## కోర్టుల జోక్యం వద్దనుకుంటే ఎన్నికలు వాయిదా వేసుకోండి

### తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు సూచన




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీసీలకు 42% రిజర్వేషన్ జీవోపై దాఖలైన లంచ్ మోషన్ పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. ఎన్నికల ప్రక్రియలో కోర్టు జోక్యం చేసుకోకూడదంటే ఎన్నికలు వాయిదా వేయాలని, హడావుడిగా జీవో జారీ చేసి నోటిఫికేషన్ ఇవ్వాల్సిన అవసరం ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. గవర్నర్ వద్ద సంబంధిత బిల్లులు పెండింగ్‌లో ఉన్నప్పుడు జీవోలు ఎలా జారీ చేశారని న్యాయమూర్తి ప్రశ్నించారు. ప్రభుత్వం సమాధానం చెప్పడానికి సమయం కోరడంతో విచారణను వచ్చే నెల 8 తేదీకి వాయిదా వేసిన హైకోర్టు, ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినా విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. జీవో చెల్లుబాటు కాదనే అభిప్రాయంతో, నోటిఫికేషన్ జారీ చేస్తే కోర్టు వివాదాల్లో ఇరుక్కుంటుందని, స్టే వస్తే ఎన్నికలు ఆగిపోతాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. అధికారంలోకి

2లో..

## శిల్పకళా వేదికలో కొలువుల పండగ

- గ్రూప్-1 విజేతలకు నియామక పత్రాల అందజేత
- మూడు లక్షల మంది పోటీ పడితే 562 మంది ఎంపికయ్యారన్న ముఖ్యమంత్రి
- తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయవద్దని గ్రూప్-1 విజేతలకు సూచన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన 562 గ్రూప్-1 అభ్యర్థులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని శిల్పాకళా

2లో..

## ఎమ్మెల్యేలు గీత దాటొద్దు.. ఇది టీం వర్క్

### - సీఎం చంద్రబాబు హెచ్చరిక

- ఎమ్మెల్యేలు వ్యక్తిగత అజెండాలు పక్కనపెట్టాలని సీఎం చంద్రబాబు స్పష్టం
- అసెంబ్లీలో సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీల అమలుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- పెన్షన్ల కోసం ఏటా రూ.32,143 కోట్లు ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని వెల్లడి
- స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు 8.86 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని వివరణ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** "డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంది కాబట్టే 15 నెలల్లో ఇన్ని కార్యక్రమాలు చేయగలిగాం. ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్ సహకారంతో ఈ ప్రభుత్వం ఒక టీంలా పనిచేస్తోంది. ఈ టీంలో ఏ ఒక్కరు తప్పు చేసినా, విఘాతం కలిగించేలా వ్యవహరించినా రాష్ట్రానికే నష్టం జరుగుతుంది. ఎమ్మెల్యేలు వ్యక్తిగత అజెండాలు పెట్టుకుని మాట్లాడితే అభివృద్ధి లక్ష్యానికి ఆటంకం కలుగుతుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ఎమ్మెల్యేలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. శాసనసభలో నేడు 'సూపర్ సిక్స్', ఇతర మేనిఫెస్టో హామీల అమలుపై జరిగిన చర్చలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వ ప్రగతిని వివరించారు.

#### సంక్షేమ పథకాల అమలుపై సమగ్ర నివేదిక

కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ముఖ్యమంత్రి అంకెలతో సహా వివరించారు. "ఎంతో ఆలోచించి పింఛన్ల పథకానికి

2లో..

## విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట

2లో..

- 30 మందికి పైగా మృతులు, ప్రధాని మోదీ సంతాపం



## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ప్రత్యక్ష విచారణ

### - డేట్, టైం ఫిక్స్ చేసిన స్పీకర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఎమ్మెల్యేల అనర్హతా పిటిషన్ల విచారణ షెడ్యూల్‌ను శనివారం ఖరారు చేశారు. సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 11 గంటలకు మొదలయ్యే విచారణలు అక్టోబర్ 1న కొనసాగుతాయి. టిషనర్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, చింత ప్రభాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు. రెస్పాండెంట్లుగా టి. ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), కాలే యదయ్య (చేవెళ్ల), గుడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (జోగులంబ గద్వాల్) ఉన్నారు. స్పీకర్ రెండు వైపులా వాదనలు విని, 10వ షెడ్యూల్ ప్రకారం నిర్ణయం తీసుకుంటారు. ఈ ప్రక్రియ సుప్రీం కోర్ట్ ఆదేశాలకు

2లో..

## చంద్రబాబు పూర్తిగా ఆర్ఎస్ఎస్ వాదిగా మారారు

- దళితవాడల్లో 5000 గుళ్ల నిర్మాణం ఏంటంటూ కాంగ్రెస్ ఫైర్
- గుళ్లు కావాలని దళితులు అడిగారా అని షర్మిల సూటి ప్రశ్న
- టీటీడీ నిధులతో హాస్టళ్లు, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్
- గుళ్లలో దళితులనే పూజారులుగా నియమిస్తారా అని నిలదీత



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని దళితవాడల్లో టీటీడీ నిధులతో 5,000 ఆలయాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఏంటని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని అనుసరిస్తున్నారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆమె ఆరోపించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, చంద్రబాబు పూర్తిగా

2లో..

## బీఆర్ఎస్ 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమం

- పోస్టర్‌ను ఆవిష్కరించిన కేటీఆర్
- ఎంత బాకీ ఉందో తెలిపేందుకే ఈ బాకీ కార్డు
- రాష్ట్రంలో ప్రతీ వర్గానికీ ప్రభుత్వం బాకీపడిందన్న కేటీఆర్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో అధికారం కోసం అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీఆర్ఎస్ సమరశంఖం పూరించింది. ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ సర్కారు, రాష్ట్రంలోని ఏ వర్గానికి ఎంతెంత బాకీ పడిందో లెక్కలతో సహా ప్రజల ముందు ఉంచేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని మొదలుపెట్టింది. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'బాకీ కార్డు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలే నేడు ప్రజల చేతిలో పాశుపతాస్త్రాలుగా మారాయని ఆరోపించారు. రాబోయే పంచాయతీ, జూబ్లీహిల్స్ బై ఎలక్షన్‌లో తగిన

2లో..

## తెలంగాణలో 23 మంది ఐపీఎస్‌ల బదిలీలు

### - హైదరాబాద్ సీపీగా సజ్జనార్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో ప్రభుత్వం ఒక పెను మార్పునకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన పోలీస్ వ్యవస్థతో సహా ముఖ్య విభాగాలకు చెందిన 23 మంది ఐపీఎస్ అధికారులను తక్షణమే బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పుతో రాష్ట్ర హోంశాఖ, పౌర సరఫరాల శాఖ, ఆర్టీసీ వంటి ప్రధాన శాఖల్లో కొత్త సారథులు బాధ్యతలు చేపట్టనున్నారు.

2లో..

## బీఎస్ఎన్ఎల్ శక్తివంతమైన వ్యవస్థగా మారింది

- విజయవాడలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల ప్రారంభోత్సవం
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని
- భద్రతకు క్వాంటం కంప్యూటింగ్ ఎంతో అవసరమని వ్యాఖ్య
- టెక్నాలజీ మార్పును ఎవరూ ఆపలేరని స్పష్టం చేసిన చంద్రబాబు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** విజయవాడలో శనివారం జరిగిన బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్వాంటం మిషన్‌ను ముందుకు తీసుకెళ్తున్నారని

2లో..

# విద్యార్థులకు రూ.2 వేల స్కాలర్‌షిప్

మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదట 1956లో ఐటీఐలు స్థాపించారని గుర్తు చేశారు. అయితే, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను అందించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కాలానుగుణంగా కోర్సులను అప్‌గ్రేడ్ చేయకపోవడంతో ఐటీఐలు నిర్వీర్యమయ్యాయని అన్నారు.

### ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత, ఐటీఐలను పునరుద్ధరించాలని సంకల్పించామన్నారు. ఈ లక్ష్యంతో ఇప్పటి ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసినట్టు ప్రకటించారు. "సంకల్పం ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదు, సాధించలేనిది ఏదీ లేదు" అంటూ ఆయన యువతకు ధైర్యం నింపారు. తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా 65 ఏటీసీలను ఇప్పటికే పూర్తి చేశామని, ఇవాళ మరో 51 ఏటీసీలను మంజూరు చేశామని పేర్కొన్నారు. అవి కూడా ఏడాదిలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సర్టిఫికెట్ ఉన్నా, నైపుణ్యం లేకపోతే ఉపయోగం ఉండదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు. యువతకు నైపుణ్యం అందించాలనే ఉద్దేశంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించామని వెల్లడించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని, యువతలో నైపుణ్యాలను మెరుగుపరచాలని తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

### అవకాశాలు వినియోగించుకోండి, డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు

సాంకేతిక నైపుణ్యంపై విద్యార్థులు ఫోకస్ పెట్టాలన్నారు. జర్మనీ, జపాన్ వంటి దేశాలు కూడా మన టాలెంట్ ముందు మోకరిల్లే రోజులు వస్తాయని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 'చదువు ఒక్కటే మీ తలరాతను మార్చగలదు. మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది. అందుకే ప్రభుత్వం ఇచ్చే అవకాశాన్ని వినియోగించుకోండి' అంటూ యువతను ప్రోత్సహించారు. సమాజాన్ని పాడు చేస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులకు బాధ కలిగించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. మీ సోదరుడిగా, మీ భవిష్యత్తు కోసం మేము ప్రణాళికలు వేస్తున్నాం అన్నారు. జపాన్ ప్రభుత్వం మన యువతకు ట్రెయినింగ్ ఇచ్చి అక్కడ ఉద్యోగాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. తెలివి, కమిట్మెంట్ ఉంటే ఎవరైనా ఉన్నత స్థానానికి చేరవచ్చని అన్నారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్

97,500 మొబైల్ 4జీ టవర్లను ప్రధాని మోదీ ప్రారంభించారు. దేశంలోని ప్రతి గ్రామానికి 4జీ సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన '100 శాతం 4జీ సాచురేషన్ ప్రాజెక్టు'కు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఒడిశాలోని 2,472 గ్రామాలతో సహా దేశవ్యాప్తంగా సరిహద్దు, మారుమూల, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని 26,700కు పైగా గ్రామాలకు తొలిసారిగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో సుమారు 2.2 కోట్ల మంది పౌరులకు ప్రయోజనం చేకూరనుంది.

### భారత టెక్ దిగ్గజాల భాగస్వామ్యం

ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు దేశీయ టెక్ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ-డాట్), తేజస్ నెట్‌వర్క్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా టీసీఎస్ డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ వంటి బాధ్యతలను నిర్వర్తించగా, సీ-డాట్ కోర్ అప్లికేషన్‌ను, తేజస్ నెట్‌వర్క్స్ బేస్ స్టేషన్లు, రేడియో పరికరాలను అందించాయి. లక్షకు పైగా సైట్లలో ఈ స్వదేశీ పరికరాలను విజయవంతంగా నెలకొల్పారు. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనది కావడంతో, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసేందుకు వీలుంటుందని అధికారులు తెలిపారు. ఈ విజయంతో, సొంతంగా 4జీ, ఆపై టెక్నాలజీలను అభివృద్ధి చేసిన డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా వంటి అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది. టెలికాం పరికరాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి, జాతీయ భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలక ముందడుగు అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### గ్రామీణ భారత్‌కు డిజిటల్ వరం

ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జె. రవి మాట్లాడుతూ, "ఇది జాతి గర్వించదగ్గ చారిత్రాత్మక విజయం. టీసీఎస్, తేజస్ నెట్‌వర్క్స్, సీ-డాట్ భాగస్వామ్యంతో నిర్మించిన మా స్వదేశీ 4జీ నెట్‌వర్క్, ఆత్మనిర్భర్ భారత్ నినాదానికి నిలువుటద్దం" అని అన్నారు. టీసీఎస్ సలహాదారు, తేజస్ నెట్‌వర్క్స్ ఛైర్మన్ ఎన్. గణపతి సుబ్రమణియం మాట్లాడుతూ, "సొంతంగా టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేసిన అతికొద్ది దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడం మాకు గర్వకారణం. బీఎస్ఎన్ఎల్‌లో ఈ నెట్‌వర్క్‌ను విజయవంతంగా వ్యవస్థీకృతం చేయడం దేశంలోని ప్రతి మూలకు శక్తివంతమైన డేటా, వాయిస్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లడంలో చరిత్రాత్మకమైనది" అని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్య, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, 24 గంటల టెలిమెడిసిన్ వంటి సేవలు అందుబాటులోకి రావడానికి ఈ నెట్‌వర్క్ దోహదపడుతుంది. ప్రధాని మోదీ కలలు కన్న 'డిజిటల్ ఇండియా' లక్ష్య సాధనలో ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ఒక మైలురాయిగా నిలిచిపోతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# ఎమ్మెల్యేలు గీత దాటొద్దు.. ఇది టీం వర్క్

'పేదల సేవలో' అని పేరు పెట్టాం. ఈ కార్యక్రమం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది" అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 63.50 లక్షల మందికి ప్రతినెలా రూ.2,745 కోట్లు ఖర్చు చేస్తూ పింఛన్లు అందిస్తున్నామని, ఇందులో 59 శాతం మహిళలే ఉన్నారని తెలిపారు. ఏడాదికి రూ.32,143 కోట్లతో దేశంలోనే అత్యధికంగా పింఛన్లపై ఖర్చు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని, మన తర్వాత ఉన్న తెలంగాణ, కేరళ రాష్ట్రాలు మన ఖర్చులో పావు వంతు మాత్రమే చేస్తున్నాయని పోల్చి చెప్పారు. సచివాలయ సిబ్బంది కృషితో తొలిరోజే 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తవుతోందని అభినందించారు.

### ఆనందంగా భరిస్తాం

మహిళల అభ్యున్నతికి అమలు చేస్తున్న పథకాల గురించి చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "స్త్రీ శక్తి పథకం నాకు అత్యంత సంతృప్తినిచ్చింది. ఈ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 8.86 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు చేశారు. దీనివల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది. ఏటా రూ.2,963 కోట్లు ఖర్చయినా ఆనందంగా భరిస్తాం" అని అన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు ఆర్థికంగా ఆదాతో పాటు, సామాజికంగానూ మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. 'తల్లికి వందనం' పథకం కింద 66.57 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు అందించామని, ఇంకా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 'దీపం-2.0' పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని, ఇప్పటివరకు 2.66 కోట్ల సిలిండర్లు పంపిణీ చేశామని తెలిపారు. రాష్ట్రంలో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే లక్ష్యమని, ఈ బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

### రైతులు, యువతకు అండగా ప్రభుత్వం

"నేను రైతు కుటుంబం నుంచే వచ్చాను. రైతులను ఆదుకునే బాధ్యత తీసుకున్నందుకు సంతోషంగా ఉంది" అని చెబుతూ రైతు సంక్షేమ పథకాలను వివరించారు. 'అన్నదాత సుఖీభవ' కింద రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.14,000 అందిస్తోందని, పీఎం కిసాన్‌తో కలిపి రైతులకు ఏటా రూ.20,000 అందుతోందని తెలిపారు. ఇప్పటికే 46.86 లక్షల మంది రైతులకు రూ.3,174 కోట్లు అందించామని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కేంద్రం కన్నా మెరుగైన ప్యాకేజీ ఇస్తున్నామని, ధాన్యం కొనుగోళ్ల కోసం రూ.12,858 కోట్లు, ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ కోసం రూ.991 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. యువతకు ఉద్యోగాల కల్పన ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని, ఇప్పటికే 4,71,574 మందికి ఉద్యోగావకాశాలు కల్పించామని పేర్కొన్నారు.

### ఆరోగ్యం నుంచి అన్నదానం వరకు భరోసా

ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించే 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'ని అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించామని, త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో మరో 70 ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా వచ్చే ఏడాది జూన్ నాటికి 6.15 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తామని, 2029 నాటికి ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండేలా చూస్తామని స్పష్టం చేశారు.

### నా ఊపిరి ఉన్నంత వరకు పేదల కోసమే పనిచేస్తా

గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని, రామతీర్థం, అంతర్వేది, దుర్గ గుడి ఘటనలను ఆయన గుర్తుచేశారు. ఇసుక మాఫియాను అరికట్టి, ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. "నాపై క్లైమోర్ మైన్లతో దాడి చేసినప్పుడు వెంకటేశ్వర స్వామి ప్రాణభిక్ష పెట్టారు.

నా ఊపిరి ఉన్నంత వరకు పేదల కోసమే పనిచేస్తాను. రాష్ట్రాన్ని పునర్నిర్మించి, తెలుగు జాతిని దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలబెట్టడమే నా లక్ష్యం. ఆ దిశగా అందరూ కలిసి పనిచేయాలి" అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

# శిల్పకళా వేదికలో కొలువుల పండగ

వేదికలో జరిగిన 'కొలువుల పండగ' కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీలు, ఆర్డీవోలు, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్లు వంటి 563 పోస్టులకు ఎంపికైన వీరికి నియామక పత్రాలు అందించారు. తెలంగాణ ఏర్పడిన 2014 సంవత్సరం నుంచి గ్రూప్-1 నియామకాలు పూర్తి కావడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముందుగానే, సెప్టెంబర్ 24న టీజీపీఎస్సీ ఎంపిక జాబితాను ఖరారు చేసింది. నియామకాలకు సంబంధించి హైకోర్టు డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఆదేశాన్ని సస్పెండ్ చేయడంతో ఈ ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల వేతనంలో 10 శాతం వారికి చెల్లించేలా చట్టం తీసుకువస్తామని గ్రూప్-1కు ఎంపికైన ఉద్యోగులను రేవంత్ రెడ్డి హెచ్చరించారు. గ్రూప్-1 పరీక్షలకు మూడు లక్షల మందికి పైగా పోటీ పడిగా 562 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన ఉద్యోగులెవరూ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఒకవేళ తల్లిదండ్రులను పట్టించుకోని పక్షంలో వారి వేతనంలో 10 శాతం తల్లిదండ్రులకు అందేలా చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, తాను డబ్బులు తీసుకుని గ్రూప్-1 ఉద్యోగాలు అమ్ముకున్నానని కొందరు దుష్ప్రచారం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుట్ర వెనుక కోచింగ్ సెంటర్ల హస్తం ఉందని ఆయన ఆరోపించారు. పదేళ్లు తెలంగాణ ప్రజలు అవకాశమిస్తే బీఆర్ఎస్ నేతలు విశ్వాసఘాతకులుగా మిగిలిపోయారని ఆయన విమర్శించారు.

# కోర్టుల జోక్యం వద్దనుకుంటే ఎన్నికలు వాయిదా వేసుకోండి

వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, మార్చి 18, 2025న బీసీ కోటాను 42%కు పెంచే బిల్లులను అసెంబ్లీలో ఆమోదించారు. ఆగస్టు 31న మరో రెండు బిల్లులు ఆమోదించి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50% మించి రిజర్వేషన్లు అమలు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. కానీ అవి పెండింగ్ లో ఉన్నాయి. డెడికేటెడ్ బీసీ కమిషన్ నివేదిక, కుల సర్వే ఆధారంగా 42% బీసీ కోటా నిర్ణయించినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది.స్థానిక ఎన్నికలకు కోర్టు పెట్టిన గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుంది. అందుకే నోటిఫికేషన్ ఇవ్వాలన్న ఉద్దేశంతో శుక్రవారం జీవో జారీ చేశరు. జిల్లా కలెక్టర్లు రిజర్వేషన్ మ్యాట్రిక్స్‌ను సీల్డ్ కవర్లలో పంచాయతీ రాజ్ విభాగానికి సమర్పించారు. ఈ మ్యాట్రిక్స్ ప్రకారం, గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులు (ఎంపీపీ), జిల్లా పరిషత్తులు (జడ్పీ)లో బీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు నిర్ణయిస్తారు. జీవో విడుదలైనందున వెంటనే పంచాయతీ రాజ్ విభాగం ఎస్ఈసీకు సిఫార్సు చేస్తుంది. ఎస్ఈసీ ఒకటి లేదా రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. ఆదివారం నోటిపికేషన్ జారీ చేయాలని అనుకున్నారు. కానీ కోర్టు చేసిన వ్యాఖ్యలతో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ ఏర్పడింది. స్థానిక ఎన్నికలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి దశలో జడ్పీ చైర్మన్‌లు (31), జడ్పీటీసీలు (566), ఎంపీపీ ప్రెసిడెంట్లు (566), ఎంపీటీసీలు (5,773) ఎన్నికలు. రెండో దశలో గ్రామ పంచాయతీలు జరపాలని కసరత్తు చేశారు. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ఎస్ఈసీ ప్రకటించింది.

# విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట

చెన్నై (ప్రశ్న న్యూస్)తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ కరూర్ ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటలో మృతుల సంఖ్య 36కి పెరిగింది. మృతుల్లో ఆరుగురు చిన్నారులతో పాటు పార్టీ కార్యకర్తలు ఉన్నారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ప్రచార సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో, ఆయన ప్రసంగిస్తున్న సమయంలో వారిని నియంత్రించడం కష్టమై తొక్కిసలాటకు దారితీసింది. ఈ తొక్కిసలాటలో ఆరుగురు చిన్నారులు, 16 మంది మహిళలు మరణించారని రాష్ట్ర మంత్రి సుబ్రమణియన్ తెలిపారు. 40 మందికి పైగా గాయపడి కరూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఇతర ఆసుపత్రుల నుండి వైద్యులను, ఫోరెన్సిక్ నిపుణులను కరూర్ ప్రభుత్వ ఆసుపత్రికి రప్పించినట్లు ఆయన వెల్లడించారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన సంతాపం తెలియజేస్తూ, "తమిళనాడులోని కరూర్‌లో జరిగిన రాజకీయ ర్యాలీలో చోటుచేసుకున్న దురదృష్టకర సంఘటన చాలా బాధాకరం. ఆప్తులను కోల్పోయిన వారికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు.

### 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే, డీఎంకే మధ్యే పోటీ - విజయ్

తమిళనాడులో 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమ టీవీకే పార్టీ, అధికార డీఎంకే మధ్యే ప్రధానంగా పోటీ ఉంటుందని టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యటిస్తున్న ఆయన నమక్కల్‌లో మాట్లాడుతూ, డీఎంకే నెరవేరని వాగ్దానాలతో ఓటర్లను మోసం చేసిందని ఆరోపించారు. తాను ఆచరణ సాధ్యమయ్యే హామీలనే ప్రజలకు ఇస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తాము ఎప్పటికీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. అవకాశవాద ఒప్పందాలతో తమిళనాడు రాష్ట్రానికి ఎన్నటికీ ద్రోహం చేయబోమని ఆయన తేల్చి చెప్పారు. ఈరోజు డీఎంకేకు ఓటు వేస్తే అది పరోక్షంగా బీజేపీకి ఓటు వేయడమే అవుతుందని అన్నారు. అధికార డీఎంకే కేంద్ర ప్రభుత్వంతో రహస్య ఒప్పందం కుదుర్చుకుందని ఆయన ఆరోపించారు. భవిష్యత్తులో తమిళనాడులో టీవీకే ప్రభుత్వం ఏర్పడితే రోడ్లు, పరిశుభ్రమైన తాగునీరు, ఆరోగ్య సంరక్షణ, మహిళల భద్రత వంటి ప్రాధాన్యతాంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ఆచరణ యోగ్యమైన ప్రణాళికలను మాత్రమే తాము ప్రకటిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆకాశంలో కోటలు నిర్మించాలనే ఆలోచన తమకు లేదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా తరహా రోడ్లు నిర్మిస్తామని ఆచరణకు అందని హామీలు ఇవ్వబోమని ఆయన తేల్చి చెప్పారు. నమక్కల్ తమిళ స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిన భూమి అని ఆయన అభివర్ణించారు. నమక్కల్‌కు చెందిన పి. సుబ్బరాయన్ అణగారిన వర్గాలకు రిజర్వేషన్ హక్కుల సాధన కోసం అవిశ్రాంతంగా పోరాడారని గుర్తు చేశారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ప్రత్యక్ష విచారణ

అనుగుణంగా జరుగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు 2024 మార్చి-ఏప్రిల్‌లో కాంగ్రెస్‌లోకి చేరారు. దానం నగేందర్ (ఖైరతాబాద్), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకటరావు (భద్రాచలం), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ), కాలే యదయ్య (చేవెళ్ల), టి. ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), ఎం. సంజయ్ కుమార్ (జగిత్యాల), గుడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి). ఈ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు కల్వకుంట్ల సంజయ్, చింత ప్రభాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి మొదలైనవారు స్పీకర్ వద్ద అనర్హతా పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. జూలై 31, 2025న సుప్రీం కోర్టు సిజెఐ బీఆర్ గవాయ్ బెంచ్ స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఆదేశాలతో స్పీకర్ విచారణ మొదలుపెట్టారు. ఆగస్టు 21, 2025న స్పీకర్ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు.

వీరిలో 8 మంది పోచారం శ్రీనివాస్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, యాదయ్య, తెల్లం వెంకటరావు, మహిపాల్ రెడ్డి, సంజయ్ రిప్లైలు ఇచ్చారు. వీటిని పిటిషనర్లకు ఫార్వర్డ్ చేసి, 3 రోజుల్లో అభ్యంతరాలు సమర్పించమని చెప్పారు. సెప్టెంబర్ 19న అదనపు నోటీసులు ఇచ్చి, "అదనపు ఎవిడెన్స్ సమర్పించండి" అని ఆదేశించారు. బీఆర్ఎస్ పిటిషనర్లు అఫిడవిట్ రూపంలో సమర్పించారు. ఈ కేసుల్లో క్రాస్-ఎగ్జామినేషన్ కీలకం. సెప్టెంబర్ 29 సోమవారం, 11 గంటలకు చింత ప్రభాకర్ వర్సెస్ గుడెం మహిపాల్ రెడ్డి, చింత ప్రభాకర్ వర్సెస్ కాలే యాదయ్య, కల్వకుంట్ల సంజయ్ వర్సెస్ టి. ప్రకాశ్ గౌడ్. పల్లా రాజేశ్వర్ రెడ్డి వర్సెస్ బండ్లా కృష్ణమోహన్ రెడ్డి లను క్రాస్ ఎగ్జామిన్ చేస్తారు. అక్టోబర్ 1 బుధవారం మిగిలిన వాదనలు, క్రాస్-ఎగ్జామినేషన్. రెండు వైపులా ఆర్గ్యుమెంట్స్ వింటారు.

# చంద్రబాబు పూర్తిగా ఆర్ఎస్ఎస్ వాదిగా మారారు

బీజేపీ వ్యక్తిగా, ఆర్ఎస్ఎస్ వాదిగా మారిపోయారని విమర్శించారు. భారత రాజ్యాంగానికి బదులుగా రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని చూస్తున్నారని, లౌకిక రాష్ట్రంలో ఒక మతానికే పెద్దపీట వేయడం సరికాదని అన్నారు.

తిరుపతిలో ముఖ్యమంత్రి చేసిన ఈ ప్రకటనను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆమె స్పష్టం చేశారు."దళితవాడల్లో 5,000 గుళ్లు నిర్మించాలని అసలు ఎవరు అడిగారు.?" అని షర్మిల ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. టీటీడీ దగ్గర నిధులు అధికంగా ఉంటే, వాటిని దళితుల అభివృద్ధికి ఎందుకు ఉపయోగించరని నిలదీశారు. రాష్ట్రంలోని మహిళా సంక్షేమ హాస్టళ్లలో వసతుల కొరతపై ఇటీవల హైకోర్టు చేసిన వ్యాఖ్యలను ఆమె గుర్తుచేశారు. గుళ్ల నిర్మాణానికి బదులుగా ఆ నిధులతో హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, దళిత కాలనీల్లో పారిశుద్ధ్యం వంటి కనీస వసతులు మెరుగుపరచాలని ఆమె ప్రభుత్వానికి సూచించారు.

ఈ ఆలయాలను నిర్మిస్తే, వాటిలో పూజారులుగా బ్రాహ్మణులను నియమిస్తారా లేక దళితులకే ఆ అవకాశం కల్పిస్తారా అని చంద్రబాబును స్పష్టం చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. దళితులపై నిజంగా ప్రేమ ఉంటే, వారి సంక్షేమంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఇటీవల ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్ అభ్యర్థికి మద్దతివ్వడంతోనే చంద్రబాబు బీజేపీలో చేరిపోయారనే విషయం స్పష్టమైందని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే 5000 గుడుల నిర్మాణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఆ నిధులను దళితవాడల సమగ్రాభివృద్ధికి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ తరపున తాము డిమాండ్ చేస్తున్నట్లు షర్మిల తెలిపారు.

# బీఎస్ఎన్ఎల్ శక్తివంతమైన వ్యవస్థగా మారింది

గుర్తుచేశారు. అందులో భాగంగానే అమరావతిలో ఈ అత్యాధునిక కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, బీఎస్ఎన్ఎల్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో ప్రతి పదేళ్లకు ఒకసారి కొత్త ఆవిష్కరణలు వస్తుంటాయని, టెక్నాలజీలో మార్పును ఎవరూ ఆపలేరని అన్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల ప్రారంభంతో ప్రభుత్వ రంగ సంస్థ సేవలు మరింత విస్తృతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ టెక్నాలజీని ప్రారంభించడం శుభపరిణామమని అన్నారు. ఇక, వచ్చే ఏడాది జనవరి నాటికి అమరావతిలో రాష్ట్రంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. భవిష్యత్తులో భద్రతా పరమైన అంశాలకు క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థలు ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.

# తెలంగాణలో 23 మంది ఐపీఎస్‌ల బదిలీలు

### రాజధాని కమాండ్ సజ్జనార్ చేతుల్లో

ఈ బదిలీల పరంపరలో అత్యంత కీలకమైన నియామకం, మీడియా వర్గాలతోపాటు, ప్రజల దృష్టిని ఆకర్షించింది. అదే హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ (సీపీ) పోస్టు. రాష్ట్ర రాజధాని, టెక్నాలజీ హబ్ అయిన హైదరాబాద్‌లో శాంతిభద్రతలను పర్యవేక్షించే అత్యున్నత బాధ్యతను సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ నిర్వహణ, ముఖ్యంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర స్థాయి ప్రముఖుల భద్రతను పర్యవేక్షించే ఈ కీలక స్థానంలో సజ్జనార్ నియామకం రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి కొత్త శక్తిని ఇవ్వనుంది.

### హోంశాఖకు సీవీ ఆనంద్

రాష్ట్ర హోంశాఖ పరిపాలనా వ్యవహారాల్లో పటిష్టతను తీసుకురావడానికి ప్రభుత్వం అత్యంత కీలకమైన మరో నిర్ణయం తీసుకుంది. హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్‌ను నియమించింది. పోలీస్ బలగాల నిర్వహణ, ఆస్తులు, మౌలిక సదుపాయాలు, రక్షణ సంబంధిత విధాన నిర్ణయాలు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఉంటాయి. సీవీ ఆనంద్ నియామకం ద్వారా, రాష్ట్ర పోలీస్ వ్యవస్థకు చెందిన సీనియర్ అధికారి, పరిపాలనా విభాగాన్ని పర్యవేక్షించడం వలన, లా అండ్ ఆర్డర్ విభాగాలు, పరిపాలన మధ్య సమన్వయం మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ఈ నియామకం ద్వారా పాలనలో వేగం, నిర్ణయాల్లో స్పష్టత పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

### ఇంటెలిజెన్స్ డీజీగా విజయ్ కుమార్

ఏదైనా రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణకు, ప్రభుత్వాన్ని రక్షించడానికి మూల స్తంభంలా పనిచేసే విభాగం ఇంటెలిజెన్స్ . కీలకమైన సమాచారాన్ని సేకరించడం, ఉగ్రవాద బెదిరింపులను, అంతర్గత భద్రతా సమస్యలను ముందుగానే పసిగట్టడం ఈ విభాగం బాధ్యత. ప్రభుత్వం ఇంటెలిజెన్స్ డీజీగా విజయ్ కుమార్‌ను నియమించడం ద్వారా, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన ముందస్తు వ్యూహాలను పటిష్టం చేయడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఒక కీలక సమయంలో, అత్యంత నమ్మకస్తుడైన, అనుభవజ్ఞుడైన అధికారికి ఈ బాధ్యతలు అప్పగించడం వ్యూహాత్మక చర్యగా చెప్పవచ్చు.ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో, అవినీతి నిరోధక శాఖలో (ఏసీబీ) కూడా సమర్థులైన అధికారులను నియమించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా శిఖా గోయల్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు, అవకతవకలను గుర్తించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. శిఖా గోయల్ నియామకం ద్వారా విజిలెన్స్ విభాగానికి కొత్త దిశానిర్దేశం లభించనుంది.అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విషయానికి వస్తే, ప్రస్తుతం సీఐడీ అదనపు డీజీగా ఉన్న చారుసిన్హాకు ఏసీబీ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఒక సీనియర్ అధికారి అదనపు బాధ్యతలు స్వీకరించడం వలన, ఏసీబీ విచారణల్లో సమగ్రత, పారదర్శకత పెరుగుతాయని అంచనా. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా స్వాతిలక్రాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి నియమితులయ్యారు. ఆర్టీసీ ఆర్థిక స్థిరత్వం, ప్రజలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడం నాగిరెడ్డి ముందున్న ముఖ్య లక్ష్యాలుగా ఉన్నాయి.ఇప్పటి వరకు ఈ విభాగంలో సజ్జనార్ తన మార్క్ చూపించారు. దాన్ని కొనసాగిస్తా లేదంటే ప్రత్యేక స్టైల్‌ను అనుసరిస్తారా అనే ఆసక్తి ఉంది. పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రటరీగా స్టీఫెన్ రవీంద్రను నియమించారు. ఆహార భద్రత, రేషన్ పంపిణీ వంటి అత్యంత సున్నితమైన, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న ఈ శాఖ బాధ్యతలను స్టీఫెన్ రవీంద్రకు అప్పగించడం ద్వారా, పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. మొత్తం 23 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులు, కేవలం అధికారుల మార్పులు మాత్రమే కాదు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ, ముఖ్య పాలనా విభాగాలకు సమర్థత, అనుభవం కలిగిన అధికారులను నియమించడం ద్వారా, పాలనా యంత్రాంగాన్ని మరింత దృఢంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పం ఇందులో కనిపిస్తోంది.

# బీఆర్ఎస్ 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమం

బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటి తలుపుతట్టి, కాంగ్రెస్ బాకీల బండారాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీ కార్డుకు విరుగుడే 'బాకీ కార్డు' అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దోఖాకు బదులు తీర్చుకునే సరైన మోకా తెలంగాణ ప్రజలకు ఇప్పుడు వచ్చిందని తెలిపారు. ఏ వర్గానికి కాంగ్రెస్ ఎంత బకాయి పడిందో నిలదీసి అడగడానికే బాకీ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రస్థాయి నాయకుల నుంచి గ్రామస్థాయి కార్యకర్తల వరకు ప్రతిఒక్కరూ కార్డును ఇంటింటికీ తీసుకెళ్తారని తెలిపారు. 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మోసపోతే గోస పడతామని ఎన్నికలకు ముందు కేసీఆర్ పదేపదే చెప్పారని గుర్తుచేశారు. అదే నేడు నిజమైందన్నారు. మొదటి కేబినెట్ సమావేశంలోనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని రాహుల్ గాంధీ అన్నారని, ఇప్పటి వరకు 30కి పైగా కేబినెట్ సమావేశాలు జరిగినా ఆ ఊసే లేదని విమర్శించారు. బాండ్ పేపర్లు, ప్రామిసరీ నోట్లపై సంతకాలు పెట్టిన రేవంత్, భట్టి విక్రమార్క నేడు మాట దాటవేస్తున్నారని మండిపడ్డారు. పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే రైతుబంధును బంద్ చేస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు అన్నివర్గాల ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.'కాంగ్రెస్ బాకీ కార్డు'లోని ప్రతీ అక్షరం రేవంత్ ప్రభుత్వం మోసానికి నిలువుటద్దమని మండిపడ్డారు. ఏ వర్గాన్ని వదలకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా నిలువునా ముంచిందో అంకెలతో సహా వివరించారు. అన్నదాతల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని అడుగడుగునా దగా చేస్తున్నదన్నారు. ఎకరానికి రూ.15వేలు ఇస్తామన్న హామీ ఏమైంది?. అని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీ ఊసేలేదన్నారు. వరికి 500 బోనస్ ఇస్తామని చెప్పి చేతులెత్తేశారని మండిపడ్డారు. అది కూడా బాకీనే అన్నారు. కౌలు రైతులు, రైతు కూలీల కన్నీళ్లను పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇస్తామన్న రూ.15వేలు, 12వేలు ఏ గంగలో కలిపారు? ఇవన్నీ బాకీ కాదా? అని నిలదీశారు. మా తమ్ముళ్లు, చెల్లెళ్ల ఆశలపై కాంగ్రెస్ పార్టీ నీళ్లు చల్లిందన్నారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బాకీ ఉందన్నారు. నెలకు 4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి 22 నెలలుగా ప్రతి నిరుద్యోగికి వేలల్లో బాకీ పడిందన్నారు. మోసానికి కాంగ్రెస్ పార్టీ ఏం సమాధానం చెబుతుంది? అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం పేరుతో ఆడబిడ్డలను దారుణంగా మోసం చేసిన ప్రభుత్వం మరొకటి లేదన్నారు. నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ రోజుకు ఒక్కో మహిళకు దాదాపు 55,000 బాకీ పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెళ్లి అయిన 8 లక్షల మంది ఆడబిడ్డలకు 8 లక్షల తులాల బంగారం బాకీ ఉందన్నారు. ఇది నయవంచన కాదా? అని మండిపడ్డారు.వృద్ధులు, వితంతువుల ఉసురు ప్రభుత్వానికి తగలకుండా పోదన్నారు. నెలకు రూ.4వేల పెన్షన్ ఇస్తామని చెప్పి, 22 నెలలుగా ఒక్కొక్కరికి 44,000 బాకీ పడ్డారని తెలిపారు. దివ్యాంగుల విషయంలో మరీ దారుణమన్నారు.

నెలకు 6,000 ఇస్తామని హామీ ఇచ్చి కేసీఆర్ పెంచిన 4,000 మాత్రమే ఇస్తున్నారు. ప్రతి నెలా 2,000 కోత పెడుతూ ఒక్కో దివ్యాంగుడికి 44,000 బాకీ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల తరఫున గొంతు విప్పుతున్న తమపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. తమపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎంత వేధించినా భయపడే ప్రసక్తే లేదన్నారు. ఓవైపు న్యాయపరంగా పోరాడుతూనే.. మరోవైపు ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేదాకా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ నయ వంచనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో బాకీ కార్డులను ముద్రించామన్నారు. తెలంగాణ ప్రజలను జాగృతం చేసే ప్రచారానికి మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మల్యాలలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

కోరుట్ల, : జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో తూర్పువాడ శ్రీ కనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

నవరాత్రుల్లో ఆరవ రోజున అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పండ్లతో అలంకరించి, అర్చకులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దీక్షా స్వాములు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

# బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ సత్య ప్రసాద్

-అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, డిడబ్ల్యూవో నరేష్

-కలెక్టరేట్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) బతుకమ్మ సంబరాల్లో భాగంగా శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ పేర్కొన్నారు.మహిళలు సమిష్టిగా బతుకమ్మ ఆడటం వల్ల సాంఘీక ఐక్యత బలపడుతుందని తెలిపారు.తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు ప్రత్యేకమైన పేర్లతో బతుకమ్మ పండగ మహిళలు నిర్వహిస్తారని,ఈరోజు ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ కాగా ప్రకృతి ప్రసాదించిన తంగేడు, గునగ, బంతి మరియు రంగు రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి మహిళలు ఆట,పాటలతో పండుగ చేసుకోవడం నిజంగా కన్నులపండుగలా ఉందని, ఈ వేడుకల్లో పాల్గొనడం అనందంగా ఉందన్నారు.అందరికి బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా అధికారులు,సిబ్బంది ఉత్సాహకంగా బతుకమ్మ పాటలు పడుతూ బతుకమ్మ ఆడారు. మహిళలు బతుకమ్మ నిమజ్జనం సమయంలో చెరువులు, కుంటలు, వాగుల వద్ద జాగ్రత్త వహించాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ నిమజ్జనం ఏర్పాట్లు చేసినట్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, డిడబ్ల్యూవో నరేష్,మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అధునాతన సాంకేతిక కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివార్లలో ఏటిసీ ని నిర్మించారు. ఎటిసి ప్రారంభకార్య క్రమంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్యే డా.సంజయ్, అదనపు కలెక్టర్ బీఎస్ లత , ప్రిన్సిపాల్ రవీందర్ ,ఎమ్మార్వో వరంధన్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగిత్యాల ప్రభుత్వ ఐటిఐ కాలేజీలో యువతకు గొప్పగా ఉపాధి కల్పనలో విజయం సాధించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఐటిఐ కాలేజీలో సాంకేతిక పరిజ్ఞానం అందించే విధంగా అధునాతన సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయటానికి సుమారు రూ.33 కోట్లు కేటాయించారని అన్నారు. ప్రస్తుతం రూ.5 కోట్లు ఖర్చుతో ప్రారంభించటం జరిగిందని, 175 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. విద్యార్థులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ తో కలిసి జిల్లా కేంద్రాలలో ఐటిఐ లను 6 కోట్ల 70 లక్షలతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ గా ఏర్పాటు చేసి సుమారు 45 కోట్ల యంత్ర పరికరాలు తో నేడు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ను ఏర్పాటు చేశారని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ గెజిట్ నోటిఫికేషన్

ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఎ.సత్యనారాయణ



జగిత్యాల జిల్లా(ప్రశ్య న్యూస్) మద్యం షాపుల నిర్వహణ కొరకు దరఖాస్తుల స్వీకరణ (2025-27 లైసెన్స్ పీరియడ్), జగిత్యాల జిల్లాలో మొత్తం 71 మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఎ.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఇట్టి 71 షాపులకు గాను తేది 2025 సెప్టెంబర్ 26 నుండి 2025 అక్టోబర్ 18 వరకు (కార్యాలయ పని సమయములలో) దరఖాస్తులు స్వీకరించబడును అని తెలిపారు.దరఖాస్తు చేయదలచువారు 3 పాస్ పోర్ట్ సైజ్ పోటోలు,ఆదార్ కార్డ్, పాన్ కార్డ్ , సామాజిక వర్గం నకు కేటాయించబడిన షాపులకు దరఖాస్తు చేసుకొను అబ్యర్థులు వారి యొక్క కుల ధృవీకరణ పత్రం, దరఖాస్తు రుసుమునకు గాను రూపాయలు 3,00,000 ల డీ.డీ. (జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి, జగిత్యాల) పేరు పైన తీయవలెను లేక రూపాయలు 3,00,000 ల చలాన్ ( నాన్ రిఫండబుల్) దరఖాస్తు తో పాటుగా జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి, జగిత్యాల యొక్క దరఖాస్తుల స్వీకరణ కౌంటర్, ప్రొహిబిషన్ %డ% ఎక్సైజ్ స్టేషన్, జగిత్యాల ధరూర్ క్యాంప్ నందు సమర్పించగలరు. ఇట్టి మద్యం షాపులకు దరఖాస్తులను స్వీకరించుటకు చివరి తేది 2025 అక్టోబర్ 18 , సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే కావున ఇట్టి అవకాశాన్ని వినియోగించగలరు. డ్రా తేది 2025 అక్టోబర్ 23 రోజున విరూపాక్షి గార్డెన్స్, కరీంనగర్ రోడ్, జగిత్యాల నందు ఉదయం 11 గంటలకు మొదలగును. మరిన్ని వివరాల కొరకు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇనస్పెక్టర్ , జగిత్యాల 8712658824, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇనస్పెక్టర్ ,ధర్మపురి 8712658825, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇనస్పెక్టర్ ,మెట్ పల్లి 8712658826, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇనస్పెక్టర్, జిల్లా టాస్క్ ఫోర్స్, జగిత్యాల 8712658823 లను సంప్రదించగలరు అని జిల్లా ప్రొహిబిషన్ %డ% ఎక్సైజ్ అధికారి ఎ.సత్యనారాయణ తెలిపారు.

# వేములవాడలో సద్దుల బతుకమ్మ ఎందుకు కేవలం 7 రోజులే?

## ప్రజా ప్రశ్న దినపత్రిక ప్రతినిధి గజ్జెల శ్రీనివాస్ ప్రత్యేక కథనం









తెలంగాణలో బతుకమ్మ పండుగను సాధారణంగా తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుపుకుంటారు. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో మాత్రం సద్దుల బతుకమ్మ పండుగను కేవలం ఏడు రోజులు మాత్రమే నిర్వహించడం ప్రత్యేకత. దీని వెనక ఒక చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం ఉంది.

### చరిత్ర చెబుతున్న సంగతులు..

వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి దేవాలయం (దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందినది) చుట్టూ ఈ ప్రత్యేకత ఏర్పడింది. శైవ, శాక్త, జైన సంప్రదాయాల సమ్మేళనమైన వేములవాడలో అమ్మవారి పూజలు స్వామివారి కైంకర్యంతో మిళితమై కొనసాగుతాయి.

బతుకమ్మ తొమ్మిది రోజుల ఉత్సవం చివరగా సద్దుల బతుకమ్మ వస్తుంది. కానీ వేములవాడలో ప్రత్యేక పరిస్థితుల కారణంగా, ఇక్కడి ప్రజలు మొదటి రెండు రోజులు జరుపుకోరు. కారణం ఏమిటంటే:

### ఆది సర్పవంశపు ప్రభావం..

వేములవాడ పాలకులు ఒకప్పుడు సర్పవంశానికి చెందిన రాజులు. వారు రాజరాజేశ్వరస్వామిని ఆరాధిస్తూ,తల్లి వనమాలిని (శక్తిని) కూడా పూజించేవారు. వారి కాలంలో నిర్ణయించినట్టుగా,సద్దుల బతుకమ్మ ఉత్సవం ఏడు రోజులకు పరిమితం చేయబడింది.

### రాజరాజేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సమన్వయం..

వేములవాడలోని స్వామివారి వార్షిక ఉత్సవాలు, కైంకర్యాలు అదే సమయంలో జరుగుతాయి. స్వామివారి వ్రతాలు, శక్తి పూజలు మిళితమవ్వకుండా ఉండేందుకు మొదటి రెండు రోజుల బతుకమ్మ వేడుకలను స్థానికులు మానుకున్నారు.

### అమ్మవారి అగమానుసారం పూజావిధానం..

వేములవాడలో బతుకమ్మను శైవాగమ పద్ధతిలో సమ్మిళితం చేశారు. అందువల్ల ఇక్కడ శివపూజతో కలిపి బతుకమ్మను సమర్పించే ఆచారం ఏర్పడింది. అదే కారణంగా వేడుకలు 7 రోజుల్లోనే ముగుస్తాయి.

### సద్దుల బతుకమ్మ ప్రత్యేకత..

వేములవాడలో చివరి రోజైన సద్దుల బతుకమ్మనాడు, పసుపు, గాజులు, తాంబూలాలు, నైవేద్యాలు అన్నీ కలిపి రాజరాజేశ్వరస్వామి అమ్మవారికి సమర్పిస్తారు.
ఇతర ప్రాంతాల్లో పూలనే ప్రధానంగా దేవతగా పూజిస్తారు.
కానీ వేములవాడలో పూల బతుకమ్మను అమ్మవారికి సమర్పించి, స్వామివారికి ప్రసాదం సమర్పించడం అనేది ప్రత్యేకత.

### స్థానికుల విశ్వాసం..

ఇక్కడి ప్రజలు ఒక నమ్మకం గట్టిగా నమ్ముతారు.
బతుకమ్మ పండుగను ఏడు రోజులు మాత్రమే జరుపుకుంటే, ఇంట్లో ఆరోగ్యం, ఐశ్వర్యం నిలుస్తాయి. తొమ్మిది రోజులు జరిపితే స్వామివారి కైంకర్యం భంగం కలుగుతుంది అని.

### ముగింపు..

తెలంగాణ సాంస్కృతిక చిహ్నమైన బతుకమ్మ వేములవాడలో ప్రత్యేక రూపాన్ని దాల్చి ఉంది. సద్దుల బతుకమ్మను ఏడు రోజుల్లోనే ముగించటం వెనక చరిత్ర, శైవశక్తి సంప్రదాయం, స్వామివారి కైంకర్యం అన్నీ మిళితమై ఉన్నాయి. అందుకే వేములవాడలో బతుకమ్మను తొమ్మిది రోజులకు బదులు ఏడు రోజులు మాత్రమే జరుపుకుంటారు. ఇది వేములవాడకు ప్రత్యేకతను తీసుకొచ్చిన చరిత్రాత్మక ఆచారం.

# వేములవాడలో ఘనంగా ముగిసిన "సద్దుల బతుకమ్మ" వేడుకలు

- పుట్టినిల్లు,మెట్టినింట్లో ఆడపడుచుల సందడి
- చప్పట్లతో హెూరెత్తిన మహిళల ఆటా-పాటలు
- ప్రత్యేక ఆకర్షణగా యువతుల కోలాటాలు
-మూలవాగులో బతుకమ్మల నిమజ్జనం
- మున్సిపల్ అధర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- వేడుకల్లో ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్





వేములవాడ (ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా పేరు గాంచిన ప్రసిద్ధ శైవక్షేత్రమైన వేములవాడ పట్టణంలో శనివారం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు ఉదయాన్నే రంగురంగుల తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళ బతుకమ్మలంటిని ఒకే చోట ఉంచి, చుట్టూరా తిరుగుతూ బతుకమ్మ ఆటాపాటలు ఆడారు.యువతుల దాండియా నృత్యాలు ఎంతో ఆకర్షణగా నిలిచాయి. ఏడొద్దులకే వేములవాడలో బతుకమ్మ ప్రత్యేకత కావడంతో అత్తారింట్లో ఉన్న ఆడపడుచులు సొంత ఊరికి చేరుకొని, కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా వేడుకలను జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను చేత పట్టుకొని ఊరేగింపుగా వెళ్లి మూలవాగులో నిమజ్జనం చేసి సాగనంపారు. మూలవాగు వద్ద పట్టణ మహిళలంతా బతుకమ్మలతో ఒక చోట చేరడంతో పూలవనాన్ని తలపించింది. దీంతో వేములవాడలో జరిగిన బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. బతుకమ్మ వేడుకల కోసం మున్సిపల్ అధికారులు రూ. 30 లక్షలతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఈ వేడుకలకుముఖ్య అతిథిగా విచ్చేసిన విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలను ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్బీ గితే,వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డిలు తిలకించి, ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

### రూ. 30 లక్షలతో బతుకమ్మ ఏర్పాట్లు

సద్దుల బతుకమ్మ వేడుకలో కోసం వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో రూ. 30 లక్షలతో బతుకమ్మ ఏర్పాట్లు చేశారు. మూల వాగు బతుకమ్మ తెప్ప వద్ద మహిళలు ఆడుకునే విధంగా గ్రౌండ్ ను చదును చేశారు. దారి పొడవునా ఎల్ఈడి లైట్లతో పాటు వారు ఆడుకునే ప్రదేశాల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. ఒక వేళ విద్యుత్ అంతరాయం ఏర్పడితే దానికి అనుగుణంగా జనరేటర్లను సైతం ఏర్పాటు చేసి, మహిళలు ప్రశాంతంగా ఆడుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు.

### పోలీసు బందోబస్తు

తెలంగాణకే తలమానికమైన రాజన్న క్షేత్రంలో బతుకమ్మ వేడుకలను జిల్లా ఎస్పీ మహేష్ బి గితే,వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో ఎలాంటి ఇబ్బంది కలగకుండా మున్సిపల్, పోలీస్ శాఖ వారు ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. వేడుకలు జరుగుతున్న ప్రాంతంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ వారు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రామ తీర్థపు మాధవి, మాజీ వైస్ చైర్మన్ బింగి మహేష్,మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, పట్టణ సీఐ వీరప్రసాద్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బీజేపీ, బీఆర్ఎస్ ఇతర పార్టీ నాయకులు,ప్రజలు, అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# రంగురంగుల పువ్వులతో ఆడపడుచుల బతుకమ్మ వేడుకలు

కేఎల్ఆర్ వెంచర్లో గల రోడ్ నెంబర్ 7లో

బతుకమ్మ సంబరాలు

పాల్గొన్న కాలనీ ఆడపడుచులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర మహిళలు బతుకమ్మ పండుగను ఆత్మగౌరవ ప్రతీకగా భావిస్తారని మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని కేఎల్ఆర్ వెంచర్లో గల రోడ్ నెంబర్ 7లో బతుకమ్మ సంబరాలు జరుపుకున్న పలువురు ఆడపడుచులు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు నంబర్ 7లో గల మహిళలు రంగురంగుల పువ్వులతో తయారుచేసిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆడపడుచులంతా తయారుచేసిన రంగురంగుల బతుకమ్మలను ఒక చోటికి చేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని ఆడపడుచులు అంత పాల్గొని బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

# మేడ్చల్ ఏటీసీని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్త



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక కేంద్రం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను వర్చువల్ గా శనివారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఐటీఐ ప్రాంగణంలోని ఏటీసీని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్త ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏటీసీలో ప్రారంభించిన ఆరు ట్రేడ్లకు సంబంధించిన మిషనరీల పనితీరు, ఉపాధి అవకాశాల గురించి బోధన సిబ్బందిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ హనుమాన్ నాయక్, బిగేట్ వైస్ చైర్మన్ మనోహర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పురపాలక కమీషనర్ చంద్రప్రకాష్ రెడ్డి, తహాసీల్దార్ భూపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివ శంకర్, మాజీ కౌన్సిలర్లు ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, కౌడే మహేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదండపురం సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షు లు నాగరాజు గౌడ్, బాల మల్లేష్, ఐటిఐ కళాశాల సిబ్బంది, పురపాలక సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో వేములవాడ ఆలయ అర్చకుల సేవలకు గుర్తింపు - ఘన సన్మానం



వేములవాడ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,విజయవాడ ఇంద్రకీలాద్రి లోని శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో 2025 దసరా మహోత్సవాల సందర్భంగా అర్చక సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం అర్చకులను ఘనంగా సన్మానించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డి, ఇంద్రకీలాద్రి ఈఓ చేతుల మీదుగా వేములువాడ అర్చకులకు సన్మానం, పతకాలు అందజేయబడ్డాయి.సన్మానం అందుకున్న వారిలో ముఖ్యంగా,వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఉప ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్ కుమార్, అర్చకులు మామిడిపల్లి శరత్ కుమార్, గోపన్నగారి చంద్రశేఖర్ లను ప్రత్యేకంగా సన్మానించారు. సన్మానం పొందిన అర్చకులను వేములవాడ ఆలయ ఈఓ రమాదేవి,ఆలయ ఉద్యోగుల యూనియన్ సభ్యులు శుభాకాంక్షలతో అభినందించారు.

## అంతర్గత శక్తికి ప్రతీక శ్రీ చండీదేవి అమ్మవారు



అమ్మవారు శక్తి, ధైర్యం, బలానికి సంకేతం. ఈ తల్లి ఆదిశక్తి స్వరూపంగా పరిగణించబడుతు శరన్నవరాత్రులలో శ్రీ మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిస్తుంది. చండీదేవిని పూజించడం వల్ల అవాంఛిత శక్తులు తొలగిపోయి, శుభఫలాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. చండీదేవి ప్రాముఖ్యత శ్రీ చండీదేవి అంతర్గత శక్తికి ప్రతీక. శ్రీమహాచండీ దేవి ఇచ్ఛా, శక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి కలయికలకు సంకేతం. అమ్మవారి రౌద్రరూపం దుర్గాదేవి యొక్క ఉగ్ర, శక్తివంతమైన రూపానికి నిదర్శనం. శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని శ్రీ మహాచండీ దేవిగా అలంకరించి పూజించడం వల్ల అమ్మవారి కరుణ కటాక్షాలతో అవరోధాలు తొలగి, శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు శ్రీ మహాచండీ దేవిగా దర్శనం ఇస్తున్నారు. దుర్గాదేవి యొక్క ఉగ్ర స్వరూపమే శ్రీ మహచండీ దేవి అవతారం చండీదేవి అవాంఛిత శక్తులు నశించి, శుభాలు కలుగుతాయని పురాణాలల్లో పేర్కొన్నారు. చండీదేవి అమ్మవారు ఒకసారి శాంతంగా మరోసారి రౌద్రంగా దర్శనం ఇస్తారు. శాంతంగా దయగల రూపంలో ఉన్న అమ్మవారిని గౌరీ, పార్వతి, హైమవతి, శతాక్షి, శాకాంభరి దేవీ, జగన్మాత, భవాని అని పిలుస్తారు. రౌద్రంగా ఉన్నప్పుడు దుర్గదేవిని కాళి, శ్యామ, చండీ, చండిక, భైరవి అని పిలుస్తారు. శ్రీ మహాచండీ అమ్మవారిని ఎరుపు రంగు వస్త్రాలు, పసుపు రంగు పూవులతో పూజించి చండీ, దుర్గా సప్తశతి చదివితే సకల సౌక్యాలతో పాటు ధైర్యం, విజయం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. చండుడు, ముండుడు అనే రాక్షసులను సంహారం చేయడంతో అమ్మవారికి చాముండేశ్వరి దేవిగా పేరు వచ్చిందన ఇతహసాల్లో పేర్కొన్నారు. దేవీ భాగవతం ప్రకారం చాముండేశ్వరి దేవిని కొలిచిన వారికి గ్రహ పీడలు తొలుగుతాయని శాస్త్రం చెబుతుంది. శరన్నవరాత్రుల్లో భాగంగా మ్మొదటి మూడు రోజులు, అమ్మవారిని శక్తి స్వరూపిణిగా, తర్వాత మూడు రోజులు అమ్మవారిని సరస్వతి స్వరూపంగా, ఆఖరి మూడు రోజు అమ్మవారిని లక్ష్మీ స్వరూపంగా కొలుస్తారని దేవి భాగవతం చెబుతోంది. ఈ సందర్భములో సరస్వతి కటాక్షంతో కూడిన శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆరాధన అత్యంత విశిష్టమైనదని పురాణాలు తెలుపుచున్నాయి.



**రవికుమార్ సంతోజు**
**బడంగ్ పేట్. రంగారెడ్డి (జిల్లా)**

## ఈఎస్ఐ ఆస్పత్రిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు





నాచారం(ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతికి, సంప్రధాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండగ వేడకలతో నాచారం లోని ఈఎస్ఐ ఆస్పత్రి ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎచ్ –1725), ఏఐటియూసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నాడు ఈఎస్ఐ ఆస్పత్రి ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను ఆహ్లాదకర వాతావరణంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వేణుకుమార్ మాట్లాడుతు తెలంగాణ కీర్తి కిరీటంలో మకుటమైన బతుకమ్మ పండగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింభమని అభివర్ణించారు. వెయ్యేళ్ళ చరిత్ర గల బతుకమ్మను తెలంగాణా ప్రజలు తమ ఇంటి దేవతగా పూజిస్తారని, అత్యంత ప్రాధాన్యత చూరగొన్న తెలంగాణ పూల పండగ అయిన బతుకమ్మ వేడుకలను ఈఎస్ఐ ఆస్పత్రిలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. రమేష్ బాబు, ఆర్ఎంఓ 1. డాక్టర్. వీణారాణి, ఆర్ఎంఓ 2.డాక్టర్. స్వేత, యూనియన్ సభ్యులు అరుణ, భాగ్య, అంజనీ, పిఎన్ శ్రీనివాస్, రమేష్, కుమార్, సంతోష్, రఘు, మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్పంచులు, ఎంపిపి ల మహిళా రిజర్వేషన్ల లాటరీ ప్రక్రియ

**జనగామ ఆర్డిఓ గోపిరామ్**



జనగామ (ప్రశ్న న్యూస్ ) జనగామ ఆర్డీఓ కార్యాలయంలో సర్పంచ్ లు, ఎంపిటిసి మహిళా రిజర్వేషన్లకు లాటరీ ప్రక్రియ ద్వారా ఆర్డీఓ గోపిరామ్ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో .సంబంధిత అధికారులతో కలిసి నిర్వహించారు.గ్రామాలు, మండలాల వారీగా తెలియజేస్తూ మహిళ రిజర్వేషన్లను లాటరీ పద్ధతిన చేపట్టారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న వెంటనే తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏ.ఓ. శ్రీనివాస రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యంగా
# టీడబ్ల్యూజేఎఫ్ ఉద్యమాలు

**విజయవంతంగా ముగిసిన టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా 3వ మహాసభలు**
**జర్నలిస్టుల సమస్యలపై చర్చలు**
**భవిష్యత్ కార్యచరణపై పలు తీర్మానాలకు సభ ఆమోదం**
**రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య,**
**బసవపున్నయ్య పర్యవేక్షణలో నూతన కమిటీ ఎన్నిక**
**45 మందితో జిల్లా నూతన కమిటీ**
**జిల్లా అధ్యక్షులుగా శేరిబాయి గణేష్, జిల్లా కార్యదర్శిగా మైల సైదులు**
**కోశాధికారిగా సీనియర్ జర్నలిస్టు వడ్ల శ్రీనివాస్‌చారి ఏకగ్రీవ ఎన్నిక**







రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్).జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యంగా టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా 3వ మహా సభలో భవిష్యత్ కార్యచరణపై పలు తీర్మానాలు చేశామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేరిబాయి గణేష్, మైల సైదులు తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న రంగారెడ్డి జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులకు, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమపై పెట్టిన బాధ్యతను నిబంధతతో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా 3వ మహాసభలు శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గంలోని కందు కూరు శుభం గార్డెన్‌లో జరిగినా ఈ మహాసభలో జర్నలిస్టు ప్రతినిధులు సుమారు 500 మంది హాజరయ్యారు. ఈ మహాసభ వేదికగా జర్నలిస్టుల సమస్యలపై చర్చించి, పలు తీర్మానాలు చేశారు. 'ప్రధానంగా ఆరోగ్య సేవలకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న అవకాశాలను జర్నలిస్టులకు కూడా ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలి. జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలో ప్రత్యేక కోటా కేటాయించాలి. ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలి. జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలి. అక్రిడిటేషన్ కార్డుల విషయంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి.' అని పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ?

**జిల్లా నూతన కమిటీ :** ఈ మహాసభలో 45 మందితో నూతనంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్‌గా సీనియర్ జర్నలిస్టు మోహన్‌రెడ్డి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులు శేరిబాయి గణేష్, జిల్లా కార్యదర్శి మైల సైదులు, జిల్లా కోశాధికారి వడ్ల శ్రీనివాసచారి.

**ఉపాధ్యక్షులు:**జిల్లా ఉపాధ్యక్షులు నోముల శ్రీశైలం, సిర్పవాడ చంద్రశేఖర్, మణికుమార్, వేణుగోపాల్, సుదర్శన్, రాందాస్, రాజు, శ్రీనివాస్.

**సహాయ కార్యదర్శులు :**జిల్లా సహాయ కార్యదర్శి చిలువేరు సురేష్, వెంకటేష్, రాఘవేందర్‌గౌడ్, మన్సూర్ అలీఖాన్, ప్రభాకర్, శ్రీనివాస్, సత్యనారాయణ.

**రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు :**చిలువేరు సురేష్, ఖాజాపాషా, శ్రీనివాస్, అనంద్, అంజనేయులు, రఘుపతి, ఆశోక్‌గౌడ్, రమేష్. జాతీయ కౌన్సిల్ సభ్యులుదేవేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## బోర్డుకి ఎస్సిఆర్ బకాయిలు "20 కోట్లు": ఈటెల



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిస్థితి రాను రాను దయనీయంగా తయారైంది. ప్రస్తుతం బోర్డు ఖజానా ఖాళీ అవ్వడంతో అధికారులు విధులు మరిచి నిధుల వేటలో ఉన్నారు.బోర్డు సిబ్బందికి ప్రతి నెల జీతభత్యాలు చెల్లించడానికి ఉన్నత అధికారులు తలలు పట్టుకుంటున్నారు.మొన్నీ ఈ మధ్య కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి పదకొండు కోట్ల గ్రాంట్ అందడంతో అధికారులు రెండు నెలల జీతభత్యాలకు సరిపడ ఉందని ఊపిరి పీల్చుకున్నా నలష్ఫై ఎనిమిది రోజులకే ఖజానా పరిస్థితి మళ్లీ పునరావృతం కావడం అధికారులను ఇబ్బందులకు గురి చేస్తుంది.ఈ నేపథ్యంలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ రూట్ మార్చారు.అసలు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కి అత్యధికంగా బకాయిలు ఉన్న సంస్థలు ఏవి అని అధికారుల నుంచి జాబితా తీసుకున్నారు.ఈజాబితాలో ముఖ్యంగా మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సర్వీసెస్ ఛార్జీలు,బేగంపేట ఎయిర్ పోర్ట్,దక్షిణ మధ్య రైల్వే తదితర శాఖల నుంచి భారీగా బకాయిలు వసూలు చేసే పనిలో పడ్డారు.ఈ నేపథ్యంలో పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ నేతృత్వంలో నిన్న శనివారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవని మర్యాదపూర్వకంగా కలసిన ఎంపీ ఈటెల,కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్.ఈ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డ్ కు రైల్వే శాఖ నుంచి రావాల్సిన సర్వీస్ ఛార్జీలు సుమారు 20 కోట్ల వరకు ఉందని వాటిని కంటోన్మెంట్ బోర్డ్ కు చెల్లించాలని జీఎం ని కోరారు.సానూకూలంగా స్పందించిన జీఎం త్వరలోనే కంటోన్మెంట్ బోర్డ్ కు చెల్లించాల్సిన బకాయిల పై రైల్వే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, వీలైనంత త్వరగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు చెల్లిస్తామన్నారు. అలాగే కంటోన్మెంట్ లోని బొల్లారం రైల్వే స్టేషన్ లో కొన్ని ఎక్స్ప్రెస్ రైలు నిలపాలని జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవని ఎంపీ ఈటెల రాజేందర్ కోరారు.ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నేత భానుక మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## దేవి నవరాత్రుల్లో మల్లన్న సేవలు.

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం బోయిన్ పల్లి లో టింకు గౌడ్ యువసేన ఆధ్వర్యంలో 16వ సంవత్సర దుర్గ మాత నవరాత్రి ఉత్సవల్లో బిఆర్ఎస్ మాజీ మంత్రివర్యులు మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి మండపానీకీ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మండపం దగ్గర ఏర్పాటు చేసిన అల్పాహారం భక్తులకు వడ్డించి భక్తులతో కలిసి అల్పాహారం స్వీకరించారు.శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డిని టింకు గౌడ్ సన్మానం చేసి ధన్యవాదములు తెలియజేసారు.మల్లారెడ్డిమాట్లాడుతూ యువతికి సంస్కృతి సంప్రదాయాలు పై కూడా అవగాహన ఉండాలి,ప్రస్తుతం సమాజంలో రాకేట్‌యుగంలో యువత పట్టుదలతో కష్టపడి అనుకున్నది సాధిస్తున్నారు.కానీ తెలుగు పండుగలు పక్కకు పెట్టి, సెల్ ఫోన్లలో బిజీ బిజీగా జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారు.అరిచేతిలో వైకుంఠ చూపిస్తున్న ఆపిల్ ఫోన్లు, శ్రమను పక్కకు పెట్టి సులువుగా జీవిత సోపానాలు ఎక్కేస్తున్నారని ఆయన అన్నారు.



# బాలకృష్ణ వ్యాఖ్యలు దుర్మార్గం

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి
- వైఎస్ జగన్ గురించి మాట్లాడే నైతిక హక్కు బాల కృష్ణకు లేదు
- బాలకృష్ణ సంస్కార హీనుడిలా మాట్లాడడం సిగ్గుచేటు విషయం
- బాలకృష్ణ సైకోగా నిర్ధారిస్తు డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికేట్ కూడ ఉంది
- బాలకృష్ణ అసెంబ్లిలో వ్యవహరించిన తీరుపై ఉమ్మడి రాష్ట్రల ప్రజలు అసహ్యించుకుంటున్నారు.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి



**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** అసెంబ్లీ వేదికగా మాజీ ముఖ్యమం త్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డిపై హిందుపూరం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అభ్యంతర కర వ్యాఖ్యలు చేయడం, అత్యం త దుర్మార్గమని గౌరవ శాసన సభలో ఎంతో హుందా తనంగా వ్యవహించాల్సిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సంస్కార హీనుడిలా మాట్లాడం సిగ్గుచేటు విషయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి తీవ్రంగా విమర్శించారు. నాయుడుపేట పట్టణం లోని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు సంబంధించిన పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం తంబిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సభలో బాలకృష్ణ వైఎస్ జగన్మోహన్రెడ్డిని ఉద్దేశించి అమర్యాదకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.వైఎస్ జగన్ గురించి మాట్లాడే నైతిక హక్కు బాల కృష్ణకు లేదన్నారు. చిరంజీవి, చంద్రబాబుతో విభే దాలుంటే వారితోనే తేల్చుకోవాలే తప్ప నోటికొ చ్చినట్టు మాట్లాడటం సరికాదన్నారు. అసెంబ్లీలో సభ్యసమాజం తలదించుకునేలా ఆయన మాట్లాడ టం తగదన్నారు.సభా మర్యాదలు పాటించకుం డా మాట్లాడి ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. సభలో ఎమ్మెల్యే బాలకృష్ణ తీరు చూశాక ఆయనకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయాలేమో అనిపించేలా ఉందన్నారు. బాలకృష్ణ సొంత ఇంట్లో కాల్పులు జరిపి మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకున్న సంగతి తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ తెలుసునన్నారు. మాజీ సీఎం జగన్ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని జంకె సూచిం చారు. భవిష్యత్లో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృ తమైతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.మాజీ సీఎం వైఎస్. జగన్మోహన్ రెడ్డిపై అసెంబ్లీలో అనుచితంగా మాట్లాడిన బాలకృష్ణకు సైకోగా నిర్ధారిస్తు డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికేట్ కూడ ఉందన్నా విషయా న్ని కూడ సుబ్రహ్మణ్యం రెడ్డి విలేకరులకు చూపించారు. జగన్ మోహన్ రెడ్డిను విమర్శించే ముందు గతంలో దివంగత మహానేత వైఎస్సార్ లి చేసిన సాయాన్ని,కూడ మరచి తడబడుతూ బాలకృష్ణ మాట్లాడినతీరుపై ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రల ప్రజలు సైతం అసహ్యించుకుంటున్న రన్నారు. అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సినీ ప్రముఖులను ఏ విధంగా స్వాగతించి ఆదరించారన్నా విషయాన్ని స్వయం ప్రముఖ పెట్టు లా చేశారన్నారు. బాలకృష్ణ గౌరవ శాసన సభలో చిగుప్పకరంగా వ్యవహరించిన తీరుతో అసెంబ్లీ వచ్చే వారికి ముందుగా బ్రీత్ ఎనలైజ ర్ పెట్టే పరిస్థితులు వస్తున్నాయన్నారు. పలు దఫాలుగా ఎమ్మెల్యేగా . గెలిచిన బాలకృష్ణ ఆయన నియోజవర్గ ప్రజలు సమస్యలపై మాట్లా డింది లేదన్నారు. అక్కడి ప్రజలు కూడ బాలకృష్ణ వ్యవహరిస్తున్నా శైలిపై అసహ్యించుకుంటున్నాట్లు తంబిరెడ్డి ఘాటుగా విమక్శించారు టీడీపీ దాని కూటమి ప్రభుత్వం ప్రతీ రోజు తమ నేత జగన్మోహన్ రెడ్డినే తిట్టడమే పనిగా పెట్టుకుంటున్నారు తప్ప ప్రజలకు ఇచ్చిన హామిలను అమలు చేయడంలో చూపడం లేదన్నారు. ఇప్పటికైనా పద్దతి మార్చుకుని హుందతనంగా వ్యవహరించాలని సుబ్రహ్మణ్యం రెడ్డి హితో పలికారు.పలు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ ఆయన నియోజవర్గ ప్రజలు సమస్యలపై మాట్లా డింది లేదన్నారు. అక్కడి ప్రజలు కూడ బాలకృష్ణ వ్యవహరిస్తున్నా శైలిపైఅసహ్యించుకుంటున్నాట్లు గా తంబిరెడ్డి ఘాటుగా విమక్శించారు టీడీపీ దాని కూటమి ప్రభుత్వం ప్రతి రోజు తమ నేత జగన్మోహన్ రెడ్డినే తిట్టడమే పనిగా పెట్టుకుంటున్నారు తప్ప ప్రజలకు ఇచ్చిన హామిలను అమలు చేయడంలో చూపడం లేదన్నారు. ఇప్పటికైనా పద్దతి మార్చుకుని హుందతనంగా వ్యవహరించాలని సుబ్రహ్మణ్యం రెడ్డి హితవు పలికారు.

**-సభ్యసమాజం తలదించుకునేలా బాలకృష్ణ వ్యాఖ్యలు**

**అసెంబ్లీ వేదికగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్** జగన్మోహన్రెడ్డిపై, ప్రముఖ సినీ నటుడు చిరంజీవిపై ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బాలకృష్ణ వైఎస్ జగన్మోహన్రెడ్డిని ఉద్దేశించి అమర్యాదకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్ గురించి మాట్లాడే నైతిక హక్కు బాలకృష్ణకు లేదన్నారు. చిరంజీవి, చంద్రబాబుతో విభేదాలుంటే వారితోనే బాలకృష్ణ తేల్చుకోవాలే తప్ప నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదని అన్నారు. అసెంబ్లీలో సభ్యసమాజం తలదించుకునేలా ఆయన మాట్లాడటం తగదని అన్నారు. ఇలా సభా మర్యాదలు పాటించకుండా మాట్లాడి ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. సభలో ఎమ్మెల్యే బాలకృష్ణ తీరు చూశాక ఆయనకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయాలేమో అనిపించేలా ఉందని అన్నారు. బాలకృష్ణ సొంత ఇంట్లో కాల్పులు జరిపి మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకున్న సంగతి తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ తెలుసునన్నారు.రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు: సుంకి సందీప్

### 42 శాతం రిజర్వేషన్లు అన్ని రాజకీయ పార్టీలు అమలు చేయాలి

### బీసీల రాజ్యాధికారానికే అడుగులు వేద్దాం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుకు ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుంకి సందీప్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ తీసుకున్న గొప్ప నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆలస్యంగా అయినా రాష్ట్రంలో ఉన్న 2 కోట్ల మంది బీసీలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు.ఇది బీసీల విజయమని అన్ని పార్టీలు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని, బీసీల రాజ్యాధికారానికై అడుగులు, ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీల నాయకులు తీసుకోలేని నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్నాడని తెలంగాణ చరిత్రలోనే కుల గణన చేపట్టిన కాంగ్రెస్ పార్టీ చరిత్రలో నిలిచిపోతుందని ఎంతమంది అడ్డంకులు సృష్టించిన 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలో రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి బీసీ సంఘాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామని సుంకి సందీప్ అన్నారు. జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య కలలు కన్నా బీసీల రాజ్యం రావాలని, బీసీల అభివృద్ధికై ఎంతో కృషిచేసిన ఆర్. కృష్ణయ్య 42% రిజర్వేషన్ అమలు కై ముఖ్యమంత్రితో ఎన్నో దఫాలు చర్చలు జరిపి రిజర్వేషన్ అమలు కై కీలక భూమిక పోషించిన ఆర్ కృష్ణయ్య కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

## కడెం గేట్ల ఎత్తివేత

మంచిర్యాల, : రాత్రి వరకు కడెం ప్రాజెక్ట్ నుంచి 7 వేల క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 1.10 లక్షల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 1.57 లక్షల క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 308 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, మిగిలిన 2.75 లక్షల క్యూసెక్కుల నీటిని 30 గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ గేట్ల ఎత్తివేత కొనసాగుతోంది.

## చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష

బెల్లంపల్లి,: మంచిర్యాల భగవంతుని వాడకు చెందిన ఉష్కమల్ల నారాయణకు, 2016లో గురజాల శ్రీనివాసరావు వద్ద తీసుకున్న 12 లక్షల అప్పు చెల్లించడంలో విఫలమై, ఇచ్చిన బ్యాంకు చెక్ బౌన్స్ అయింది. ఈ నేపథ్యంలో, మంచిర్యాల రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి నిరోష తీర్పునిస్తూ, నారాయణకు ఒక ఏడాది పాటు జైలు శిక్షతో పాటు తీసుకున్న 12 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. బాధితుడు న్యాయవాది సహకారంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈ తీర్పు వెలువడింది.

## రైలు ఢీకొని వృద్ధుడి మృతి

చెన్నూరు, : శనివారం రామకృష్ణాపూర్ పట్టణంలోని రామ్ నగర్ కు చెందిన పినుమల్ల మల్లయ్య (64) రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. రైల్వే ట్రాక్ దాటుతుండగా నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## ఎలుగుబంట్ల దాడిలో రైతులకు గాయాలు

ఆసిఫాబాద్, : నెన్నెల మండలంలోని మైలారం గ్రామ శివారులో గురువారం మూడు ఎలుగుబంట్లు దాడి చేయడంతో దుబ్బపల్లి గ్రామానికి చెందిన అర్శ మారయ్య, గావిడి మల్లేశ్ అనే గిరిజన రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. మధ్యాహ్నం గ్రామ శివారులోని పత్తి చేన్లకు వెళ్తుండగా ఎలుగుబంట్లు అకస్మాత్తుగా దాడి చేశాయి. తీవ్రగాయాలైన వీరిని వెంటనే 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## రైతు వేదికలో యూరియా పంపిణీ

సిర్పూర్, : శనివారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, కౌటాల మండలంలోని శీర్ష గ్రామంలోని రైతు వేదిక వద్ద ముత్యంపేట శీర్షి గ్రామాలకు సంబంధించిన యూరియా పంపిణీ జరిగింది. ఒక లోడ్ యూరియాను మూడు గ్రామాలకు అందించారు. అయితే, మరికొంతమంది రైతులకు యూరియా అందక ఇబ్బందులు పడ్డారు. త్వరలోనే మరో లోడ్ వస్తుందని, మిగిలిన వారికి అందేలా చూస్తామని అధికారులు తెలిపారు.

## అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన రాకపోకలు..

పెద్దపల్లి, : పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీ వర్షాల కారణంగా వరద నీరు చేరి చెరువును తలపించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ పరిస్థితి వల్ల పెద్దపల్లి, ఓదెల మండలాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోవడంతో ప్రయాణానికి వీలు లేకుండా పోయింది.

## కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో..

కరీంనగర్, : స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి దశ తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శనివారం కరీంనగర్ లోని ఎన్టీఆర్ బైపాస్ వద్ద గల ఆయన విగ్రహానికి సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచ్ఛిష్ట గణపతి ఆలయం పర్యాటక కేంద్రం కావాలి

మానకొండూరు, : శంకరపట్నంలోని భయానాగుట్టలో 500 ఏళ్ల క్రితం ఉచ్ఛిష్ట గణపతి స్వయంభూవుగా వెలిశారని స్థానికుల కథనం. పీఠాధిపతి నిక్లేశ్వరనంద ఆధ్వర్యంలో పూజారి బక్కిమొగిలి ఇక్కడ పూజలు చేస్తున్నారు. ఇక్కడ తపస్సు చేస్తే కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. కరీంనగర్ , వరంగల్, ఖమ్మం నుంచి ఇక్కడికి భక్తులు వస్తుంటారు. కాగా, ఈ ఆలయాన్ని పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని భక్తులు ప్రభుత్వం ను కోరుతున్నారు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం.

## ఉద్యమాల ఊపిరి కొండా లక్ష్మణ్ బాపూజీ

జగిత్యాల,: జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం తెలంగాణ బాపూజీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, రాజా గౌడ్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

## లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు:

మంథని, : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, బలహీనవర్గాల సంక్షేమం కోసం పాటుపడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు సుల్తానాబాద్ లో ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థాన చైర్మన్ చీకట్ల మొండయ్య, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పేదవాడి కళ నిజమైంది

# గూడు చేరువైంది:పొంగులేటి

**పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన ప్రభుత్వంలో సాకారం ఎమ్మెల్యే శ్రీగణేష్**
**సికింద్రాబాద్ కంటోన్మెంట్ నారాయణ జోపిడిలో 344**
**పట్టాలు పంపిణీ చేసిన కాంగ్రెస్ మంత్రులు,ఎంపీ, ఎమ్మెల్యే,భాజపా ఎంపీ**
**పేదవాడి జీవితంలో వెలుగులు నింపేదే కాంగ్రెస్ ప్రభుత్వం,గత పాలకుల కమీషన్**
**కక్కృతి వల్లే సామాన్యుల కళ కన్నీళ్లకే నిలయాలుగా మారాయి**
**సంతోషంలో సంబరాలు చేసుకుంటూ,గృహ ప్రవేశాలు చేసుకున్న ప్రజలు**
**స్మశానానికి జాగలేక మంత్రులతో మెరపెట్టుకున్న స్థానికులు,ఎంపీ ఈటెల**
**కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కారించాలని పొంగులేటి విజ్ఞప్తి**





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న రసూల్ పూర ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా బిసి సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పోన్నం ప్రభాకర్, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, పార్లమెంటు సభ్యులు అనిల్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్, హైదరాబాద్ డిప్యూటీ మేయర్ శ్రీలత, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా తదితరులు చేతులు మీదుగా అందజేశారు.పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రసూల్ పురా నారాయణ జోపూడిలో నిర్మాణం పూర్తయిన రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు.పొజిషన్ పత్రాలు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన,హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ కర్ణన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తూ గత ప్రభుత్వం వదిలేసిన రెండు పడక గదులను సైతం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. 288 మంది కుటుంబాలకు పట్టాలు అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు. కంటోన్మెంట్ లోని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను రక్షణ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి యిస్తే పేదలకు ఇల్లు నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు పేదలకు ఇళ్లు నిర్మించి మాట నిలబెట్టుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కంటోన్మెంట్ ప్రజలకు ఉన్న సమస్యలను తీర్చడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.రసూల్ పూర ప్రాంతంలో స్మశానానికి జాగ లేదని చనిపోయిన వారి పార్థీవ దేహం దూరప్రాంతాలకు తీసుకెళ్ళి దహన సంస్కారాలు నిర్వహించనున్నామన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఆవేదన వ్యక్తంచేశారు.వారిబాధ అర్థం చేసుకున్న మంత్రి సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భూములు ఉన్నాయి.రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన స్థలాలు లేకపోవడంతో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ ఈ సమస్య పరిష్కరించాలని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ అధికారులతో చర్చించి పేదలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూరసూల్ పూరలో గతంలో ముప్పై,యాభై గజాల స్థలంలో పేదలు ఇరుకు గదుల్లో నివసించే వారు.వారందరు ఒక్కటై ముందుకు రావడంతో ఈ రోజు రెండు పడకల గదుల నిర్మాణం పూర్తి అయినది.344 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందింది అని ఆయన అన్నారు.అలాగే జంటనగరాల్లో ఎక్కడైనా చిన్న చిన్న స్థలాల్లో పేదలు ఉంటే, స్వచ్ఛందంగా ముందుకు వస్తే ఇందిరమ్మ ఇళ్ల ఆధునిక హంగులతో సరికొత్త విధానంతో ఇండ్ల నిర్మాణం చేసిస్తామని మంత్రి పోన్నం ప్రభాకర్ తెలిపారు.అదిగాకపేదవాడి బ్రహ్మాస్త్రం రేషన్ కార్డు.హైద్రాబాద్ మహానగరంలో ఇప్పటి వరకు సుమారు అరవై ఐదు వేల రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.గత పాలకులు ప్రజలకు వారి హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవు,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ముందుగా ప్రజలకు కావలసిన రేషన్ కార్డులను అందజేసిన ఘనత సిఎం రేవంత్ రెడ్డి కేచెందుతుంది అన్నారు.

### చరిత్ర తెలియని వాళ్ళు ఉపోద్ఘాతం చేశారు..

బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఈటెల రాజేందర్ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన రసూల్ పూర నారాయణ జోపిడి ప్రాంతాన్ని సందర్శించారు.అప్పుడు ఈటెల ఆ ప్రాంతాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు.అసలు ప్రజలు ఇంత చిన్న ఇళ్లల్లో ఎలా ఉంటున్నారు అంటూ ఆవేదన వ్యక్తంచేశారు.యుద్ధప్రాదిపదికన ఈ ప్రాంతంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం చేయాలని భీష్మించుకొని,ఆ ప్రస్థావన అప్పటి సిఎం కేసిఆర్ తో చర్చించారు.అప్పటికే సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న రెండువవార్డు సిల్వర్ కాంపౌండ్ లోడబుల్ బెడ్ రూం ల ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది.అయిన కూడా రసూల్ పూర నారాయణ జోపిడి ప్రాంతంలో కూడా రెండు పడకల గదుల నిర్మాణం చేయాల్సిందేననిమొండి పట్టుదలతో ఆయన కృషే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ మంత్రులు నిన్న శనివారం ఉదయం పట్టాలు పంపిణీ చేసివారి ఖాతాలో మార్కులు వేసుకున్నారు.అసలు రసూల్ పూర నారాయణ జోపిడి ఇండ్ల నిర్మాణం పునాది వేసిన నాయకులు మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్.ఇది చరిత్ర.

### ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ..

నారాయణ జోపిడి, గాంధీనగర్,శ్రీరాం నగర్ డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ నిధులు మంజూరు చేపించి నిర్మాణం పూర్తి చేయించి రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ,ఐ అండ్ పిఆర్ శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖామాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటెల రాజేందర్,అనీల్ కుమార్ యాదవ్,డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి,బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ చేతుల మీదుగా శనివారం లబ్దిదారులకు పంపిణీ చేసి వారి సొంతింటి కలను ప్రజాపాలన ప్రభుత్వంలో సాకారం చేశారు.తమ సొంతింటి కలను సాకారం చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్ కి లబ్దిదారులు ధన్యవాదాలు తెలపడంతో మీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచిన నేను మీ సొంతింటి కలను నెరవేర్చడం బాధ్యతగా భావించనన్నారు. ఇండ్ల పట్టాల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మాట్లాడుతూ,ఇండ్ల పట్టాలు అందుకుంటున్న లబ్ధిదారులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఇండ్ల నిర్మాణానికి పూర్తిగా వెన్నుదన్నుగా నిలిచి, అధికారులతో నిరంతరం మాట్లాడి నిధులు మంజూరు చేపించి ఈరోజు ఇళ్ల పట్టాలు అందించడానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.హైదరాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రిగా ఉండి,కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో నా వెన్నంటి నిలిచి,ఈ ఇండ్ల నిర్మాణానికి అన్ని విధాల కృషిచేసి నాకు పూర్తి సహాయ సహకారాలు అందించిన రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.జిల్లా కలెక్టర్ మొదలుకొని హౌసింగ్ ఎండి వరకు నిరంతరం సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేసి త్వరగా ఈ ఇళ్ల నిర్మాణం పూర్తి చేపించినందుకు అధికార యంత్రాంగానికి కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నిక సందర్భంగా ప్రత్యేకంగా హామీ ఇచ్చిన తర్వాత గెలిచిన వెంటనే ఈ ఇండ్ల నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి పూర్తి చేయించి లబ్ధిదారులకు అందజేస్తానని మాట నిలబెట్టుకున్నాను.ఇచ్చిన హామీ మేరకు మంత్రులు,అధికార యంత్రాంగం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లి తొందరగా ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినందుకు నా కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజల తరపున అందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలియజేసిన ఎమ్మెల్యే శ్రీ గణేష్.ఎన్నో ఏళ్ల నుంచి తమ స్థలాలను ప్రభుత్వానికి అప్పజెప్పి కిరాయి ఇండ్లలో నివాసం ఉంటున్న లబ్ధిదారుల సొంతింటి కలను నా హయాంలో పూర్తి కావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు.లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం చూస్తుంటే నా జన్మ ధన్యం అయినట్లుగా భావిస్తున్నాను.కంటోన్మెంట్ నియోజకవర్గంలోని స్థలాలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో మాకు ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి ఇబ్బందిగా మారిందని మరోసారి సభలో వెల్లడించారు.మంత్రులు,ఎంపీ ఈటెల రాజేందర్ కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రక్షణ శాఖకు చెందిన స్థలాలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పజెప్పేలా కృషి చేస్తే కంటోన్మెంట్ ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన అన్నారు.సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి ఆశయమైన కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమంలో కంటోన్మెంట్ మహిళా సోదరీమణులకు కూడా అవకాశాలు కల్పించి ముందుకు తీసుకువెళ్తున్న విషయాన్ని గుర్తు చేశారు.నన్ను ఆశీర్వదించి గెలిపించిన కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలకు ఈ ప్రాంత అభివృద్ధి పథంలో నిలిపి నా ఋణం తీర్చుకుంటాన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ దాసరి హరిచందన,అడిషనల్ కలెక్టర్ ముకుంద రెడ్డి,జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్వికర్ణన్,హౌసింగ్ యండీ గౌతమ్,హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అశోక్ చక్రవర్తి, రెవెన్యూ డిపార్ట్మెంట్స్ అధికారులు, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు వైస్ చైర్మన్ దేవేందర్, టి పిసిసి సెక్రటరీ రాజేష్ యాదవ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రేమ మాయాజాలాన్ని అనుభూతి చెందండి

బాలీవుడ్ యంగ్ బ్యూటీ సోనమ్ బజ్వా బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో తీరక లేకుండా గడుపుతోంది. ప్రస్తుతం ఈ అమ్మడు నటిస్తున్న సినిమాల్లో 'నిక్కాజలిదార్-4' ఒకటి. ఈ సినిమా 'నిక్కాజలిదార్-3'కు సీక్వెల్‌గా రాబోతుంది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి సిమెర్జిత్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. రెజ్లింగ్ పై ఆసక్తి లేని ఓ పంజాబీ వ్యక్తి, ఉత్సాహభరితమైన హర్యాన్వీ స్త్రీని కలిస్తాడు. పరిచయం కాస్త ప్రేమగా మారిన తర్వాత తన ప్రపంచం మారిపోయినట్లుగా గ్రహిస్తాడు. వారు ప్రేమలో పడిన తర్వాత ఏం జరిగింది ఎలాంటి.. ప్రమాదాలు ఎదుర్కొన్నారనేది ఈ మూవీ కథ. దీనిని గున్బీర్ సింగ్ సిద్ధూ, మన్మోర్డ్ సిద్ధూ, అమ్నీత్ షేర్ సింగ్, రాంనీత్ షేర్ సింగ్ నిర్మిస్తున్నారు. ఇందులో సోనమ్ అమ్మీ విర్క్, నిర్మల రిషి, నిషా బానో, సోనియా కౌర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన సోనమ్ వరుస అప్డేట్స్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈక్రమంలో.. తాజాగా, సోనమ్ బజ్వా 'నిక్కాజలిదార్-4'చిత్రానికి సంబంధించిన ఓ ప్రేమ పాట రాబోతున్నట్లు ప్రకటించింది. "సెప్టెంబర్ 28న విడుదలవుతున్న మా సినిమా పాటతో ప్రేమ మాయాజాలాన్ని అనుభూతి చెందండి. మీ హృదయాన్ని వెచ్చదనంతో నింపే మనోహరమైన ఈ సాంగ్‌ను మీ ప్లే లిస్ట్‌లో చేర్చుకోండి" అనే క్యాప్షన్ జత చేసింది.

## బికిని ఫొటోలపై సాయి పల్లవి క్లారిటీ

పద్ధతైన పాత్రలు, అద్భుతమైన డ్యాన్సులు, క్లాసీ లుక్ వీటి గురించి మాట్లాడుకోగానే మొదట గుర్తుకు వచ్చేది హీరోయిన్ సాయి పల్లవి. సాంప్రదాయ లుక్‌లో కనిపిస్తూ కోట్లాది మంది ఫ్యాన్స్‌ను తన సొంతం చేసుకున్న ఈ బ్యూటీకి సంబంధించి లేటెస్ట్‌గా బికిని ఫొటోలు వైరల్ అయ్యాయి. తన సోదరితో విదేశాలకు వెకేషన్‌కు వెళ్ళిన ఈ మలయాళ ముద్దుగుమ్మ.. బికినీ ధరించినట్లు కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ హాట్ టాపిక్‌గా మారాయి. ఇక ఈ ఫొటో చూసిన ఆమె అభిమానులు.. తలలు పట్టుకుంటున్నారు. ఇవి నిజమైన ఫొటోలు కాకపోవచ్చు, ఎఐ ద్వారా క్రియేట్ చేసినవి కావచ్చు అంటూ భిన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. తాజాగా వీటిపై ఇన్‌డైరెక్ట్‌గా క్లారిటీ ఇస్తూ సాయి పల్లవి ఓ పోస్ట్ పెట్టింది. ట్రిప్‌కు సంబంధించిన పూర్తి వీడియోను షేర్ చేస్తూ.. 'పైన కనిపిస్తున్నవన్నీ నిజంగా తీసిన ఫొటోలు.. ఏఐ ఫొటోలు కాదు' అనే క్యాప్షన్ ఇచ్చింది. దీంతో.. ఆమె షేర్ చేసిన వీడియోలో బికిని ఫొటోలు లేకపోవడంతో.. బికిని ఫొటోలు ఏఐవి.. ఇప్పుడు తను షేర్ చేసినవి నిజమైనవి అంటూ క్లారిటీ ఇచ్చింది. దీంతో ఆమె బికిని ధరించలేదు అని క్లారిటీ రావడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు.



## ఓటీటీలోకి రాబోతున్న 'మదరాసి'

కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్, రుక్మిణి వసంత్ కాంబోలో వచ్చిన లేటెస్ట్ మూవీ 'మదరాసి'. ఈ చిత్రాన్ని ఏఆర్ మురుగదాస్ తెరకెక్కించారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ మూవీలో విద్యుత్, బీజు మీనన్ కీలక పాత్రలో కనిపించారు. శ్రీలక్ష్మీ మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని శ్రీలక్ష్మీ ప్రసాద్ నిర్మించారు. భారీ అంచనాల మధ్య ఈ సినిమా సెప్టెంబర్ 5న థియేటర్స్‌లోకి వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. 'మదరాసి' చిత్రం నెలరోజులకే డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఈ విషయాన్ని ప్రముఖ సంస్థ అధికారికంగా ప్రకటించింది. 'మదరాసి' సినిమాకు సంబంధించిన ఓటీటీ హక్కులను ప్రముఖ సంస్థ అమెజాన్ ప్రైమ్ సొంతం చేసుకోగా.. అక్టోబర్ 1 నుంచి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అందుబాటులోకి రాబోతుంది.

ఈ విషయాన్ని తెలుపుతూ.. "ఒక పిచ్చి ప్రయాణానికి సిద్ధంగా ఉండండి. 'మదరాసి'మీ ముందుకు రాబోతుంది. థియేటర్స్‌లో మిస్ అయిన వారు మా చిత్రాన్ని చూసి ఎంజాయ్ చేయండి" అనే క్యాప్షన్ జత చేశారు. అలాగే హీరో శివకార్తికేయన్‌తో అనౌన్స్ చేయించిన వీడియోను షేర్ చేశారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రియులు ఫుల్ ఖుషీ అవుతూ.. సూపర్ ఎగ్జైటెడ్ అని కామెంట్లు పెడుతున్నారు.



## అప్పుల్లో కూరుకుపోయిన సిద్ధూ జొన్నలగడ్డ..?



డీజే టిల్లు సినిమాతో బంపర్ హిట్లు అందుకున్న హీరో సిద్ధు జొన్నలగడ్డ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.ప్రతి సీన్ లో నవ్వు తెప్పించే... హీరో సిద్దు జొన్నలగడ్డ ఇప్పుడు కష్టాల్లో ఉన్నారట. పీకల్లోతు అప్పుల్లో ఉన్నాడని అతనిపై వార్తలు వస్తున్నాయి. దీనికి కారణం జాక్ సినిమా అని తెలుస్తోంది. ఈ సినిమా ఫ్లాప్ కావడంతో... తీసుకున్న రెమ్యూనరేషన్ వెనక్కి తిరిగి ఇచ్చేసాడట సిద్దు జొన్నలగడ్డ. అయితే ఆ రెమ్యూనరేషన్ వెనక్కి ఇచ్చేందుకు...బ్యాంక్ లో లోన్ తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ విషయం ఇప్పుడు వైరల్ గా మారింది. దాదాపు రూ.4.75 కోట్ల రెమ్యూనరేషన్ ఇచ్చాడట హీరో సిద్దు జొన్నలగడ్డ. తన వల్ల నిర్మాత నష్టపోకూడదన్న ముఖ్య ఉద్దేశ్యంతో... సిద్దు ఈ నిర్ణయం తీసుకున్నాడట. ఇక తన దగ్గర డబ్బులు లేకపోవడంతో.. బ్యాంక్ లో లోన్ తీసుకున్నాడట. ఆ అప్పు ఇంకా తెగలేదని సమాచారం. కాగా హీరో సిద్దు జొన్నలగడ్డ నటించిన జాక్ సినిమా ఈ ఏడాది ఏప్రిల్ లో రిలీజ్ అయింది. ఈ సినిమాకు భాస్కర్ దర్శకుడు.



## అమీషా పటేల్ సంచలన స్టేట్‌మెంట్!

ఒకప్పటి స్టార్ హీరోయిన్ అమీషా పటేల్50 ఏళ్లు వచ్చినప్పటికీ బ్యాచ్‌లర్ లైఫ్ లీడ్ చేస్తోంది. పెళ్లి చేసుకోకుండా వరుస చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది.ఎంత బిజీగా ఉన్నప్పటికీ పలు ఇంటర్వ్యూలో పాల్గొంటూ వార్తల్లో నిలుస్తోంది. ఈక్రమంలో.. గత కొద్ది కాలంగా ఈ అమ్మడు పెళ్లి చేసుకోబోతుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అమీషా పటేల్ ఓ హీరోపై షాకింగ్ కామెంట్స్ చేసింది. "హాలీవుడ్ సూపర్ స్టార్ టామ్ క్రూజ్ అంటే నాకు పిచ్చి. ఎవరైనా అతనితో పాడ్‌కాస్ట్ చేయగలిగితే.. దయచేసి నన్ను కూడా పిలవండి. నా చిన్నప్పటి నుంచి నాకు టామ్ క్రూజ్ అంటే చాలా ఇష్టం. నా ఫైల్స్‌లో కూడా అతని ఫొటో ఉండేది. నా గదిలో ఉన్న ఏకైక పోస్టర్ అతనిదే. టామ్ క్రూజ్ ఎప్పటికీ నా ఫస్ట్ క్రష్. నేను అతని కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ఏకంగా అతనితో ఒక రాత్రి గడపడానికి కూడా వెనకాడను. ఒకవేళ నాకు అవకాశం వస్తే పెళ్లి కూడా చేసుకుంటాను. అతనికి అంత పెద్ద అభిమానిని నేను ఎందుకో కారణం తెలియదు. కానీ ఆయన అంటే పడిచచ్చిపోతాను" అని అందరికీ షాకిచ్చింది. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి. ఈ అమ్మడు అంత ఒపెన్ కావడంతో అంతా షాక్ అవుతూ పలు రకాలుగా స్పందిస్తున్నారు.

## ఓజి 2 మీద పెరుగుతున్న ఆశలు

ఈ మధ్యకాలంలో బాగా పెరుగుతున్న ట్రెండ్ ఏంటంటే ఒక ఇమేజ్ ఉన్న హీరోతో సినిమా తీస్తున్నప్పుడే పార్ట్ 2కి ఛాన్స్ ఉండేలా క్లైమాక్స్ లో ట్విస్టు పెట్టేయడం. బొమ్మ బాగా ఆడితే క్రేజ్ ఉంది కదాని బాహుబలి, పుష్ప లాగా సీక్వెల్స్ కి వెళ్లిపోవచ్చు. లేదు ఏమైనా తేడా కొడితే అక్కడితో ఆగిపోవచ్చు. ప్రేక్షకులు మరిచిపోతారు. సమంత యశోద, కళ్యాణ్ రామ్ డెవిల్, చిరంజీవి గాడ్ ఫాదర్, విజయ్ దేవరకొండ కింగ్డమ్ ఈ కోవలోకే వస్తాయి. ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడంత లిస్టు ఉంది. వీటికి కొనసాగింపులు ఉండవనేది ఓపెన్ సీక్రెట్. ఇప్పుడు ఓజి వంతు వచ్చింది. ఒకవేళ యావరేజ్ అయ్యుంటే డిస్కషన్ అవసరం పడేది కాదు. కానీ సూపర్ హిట్ నుంచి బ్లాక్ బస్టర్ దిశగా అడుగులు వేస్తున్న ఓజికి కంటిన్యుయేషన్ ఖచ్చితంగా ఉండబోతోంది. దర్శకుడు సుజీత్ పలు ఇంటర్వ్యూలలో ఇదే చెబుతున్నాడు. ఇప్పుడొచ్చిన ఓజితో కలిపి మొత్తం మూడు భాగాలు తీసే ప్లానింగ్ ఉందట. ప్రస్తుతం జ్వరంతో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ మనసులో ఏముందో బయటికి వస్తే తప్ప ఓజి 2 ఎప్పుడనేది క్లారిటీ ఉండదు. ఇన్ సైడ్ టాక్ అయితే త్రివిక్రమ్, డివివి దానయ్య ద్వారా రెస్పాన్స్ తెలుసుకున్న పవన్ కళ్యాణ్ రెండో భాగం చేద్దామనే దిశగా సంకేతం ఇచ్చారట. కాకపోతే వెంటనే సాధ్యం కాకపోవచ్చు. ఎందుకో చూద్దాం. సుజీత్ ప్రస్తుతం న్యాచురల్ స్టార్ నానికి ఒక కమిట్ మెంట్ ఇచ్చాడు. బ్లడీ రోమియో అనే టైటిల్ ఆల్రెడీ ప్రచారంలో ఉంది. ది ప్యారడైజ్ పూర్తి కావడానికి ఇంకో అయిదు నెలల టైం ఉంది కాబట్టి ఈలోగా స్క్రిప్ట్ సిద్ధం చేసే పనిలో సుజీత్ బిజీ అవుతాడు. ఒకవేళ పవన్ కనక ఓజి 2 వేగంగా తీసేద్దాం అంటే నానిని రిక్వెస్ట్ చేసుకుని కొంత బ్రేక్ తీసుకుని ఇటు వచ్చేయొచ్చు.



## డ్రాకులా కామెడీలో రష్మిక మందన్న



యానిమల్, చావా బ్లాక్ బస్టర్ల పుణ్యమాని హీరోయిన్ రష్మిక మందన్న నార్త్ ఆడియన్స్ కి కూడా బాగా సుపరిచితురాలయ్యింది. సల్మాన్ ఖాన్ సికందర్ డిజాస్టర్ అయినా అవకాశాలకు లోటు లేదు కానీ అక్టోబర్ లో తను నటించిన తమ్మా విడుదల కానుంది. స్త్రీ, స్త్రీ 2, భేడియా, ముంజ్యా నిర్మించిన మాడాక్ నిర్మాణ సంస్థ కావడంతో అంచనాలు బాగానే ఉండబోతున్నాయి. అందులోనూ హారర్ సిరీస్ కాబట్టి మినిమమ్ గ్యారెంటీ అనే నమ్మకం బయ్యర్లలో ఉంటుంది. ఆదిత్య సర్పోదర్ దర్శకత్వం వహించిన తమ్మాలో ఆయుష్మాన్ ఖురానా హీరో కాగా నవాజుద్దీన్ సిద్ధిక్ కీలకమైన విలన్ పాత్ర చేస్తున్నాడు. ఇవాళ ట్రైలర్ వచ్చింది.కథేంటో అరటిపండు ఒలిచినట్టు చెప్పేశారు. వేల సంవత్సరాల వెనుక నుంచి వచ్చిన ఒక డ్రాకులా మెల్లగా మనుషుల్లో చేరుతుంది. ఆడపిల్ల రూపంలో కనిపించిన ఈమెను చూసి హీరో ఇష్టపడతాడు. కట్ చేస్తే అతనూ డ్రాకులాగా హఠాత్తుగా పళ్ళు పదునుగా మారిపోయి అవతలి వాళ్ళను భయపెడుతూ ఉంటాడు. ప్రియురాలి వల్లే ఈ పరిస్థితి వచ్చినా ఆమెను వదులుకోలేనంత ప్రేమిస్తాడు. అసలు ప్రమాదం అక్కడి నుంచి మొదలవుతుంది. లవర్ మంచితనాన్ని ఆమె అర్థం చేసుకున్నా భూమిని నాశనం చేసే లక్ష్యంతో ఉన్న ఒక దుర్మార్గుడు వీళ్లకు అడ్డుగా నిలుస్తాడు. ఆ తర్వాత జరిగేది థియేటర్లలో చూడాలి. డ్రాకులా సిరీస్ కు హాలీవుడ్ లో చాలా క్రేజ్ ఉంది. ఈ ఫ్రాంచైజ్ లో ఎప్పుడు సినిమా వచ్చినా ఖచ్చితంగా చూసే ఆడియన్స్ ఉంటారు. కాకపోతే అవన్నీ సీరియస్ గా జరుగుతాయి. కానీ తమ్మలో డ్రాకులాతో కామెడీలు చేయించారు. మాడాక్ నిర్మిస్తున్న హారర్ సినిమాలన్నీ ఒక యునివర్స్ గా మారుస్తున్నారు. అన్ని దెయ్యాలు, విచిత్ర జంతువులు ఇంకో రెండు మూడు సంవత్సరాల తర్వాత చివరి భాగంలో కలుస్తాయి. అందుకే తమ్మలో స్త్రీ, భేడియా రెఫరెన్సులు వాడేశారు. రెగ్యులర్ గ్లామర్ పాత్రలకు భిన్నంగా రష్మిక మందన్న ఎంచుకున్న ఈ కొత్త జానర్ తనకు ఎలాంటి ఫలితం ఇవ్వనుందో అక్టోబర్ 21 తేలనుంది.

# చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

- శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి
- వేములవాడ రూరల్ నూతన సబ్ ఇన్స్పెక్టర్ : చల్లా వెంకట్రాజం
- వేములవాడ రూరల్ ఎస్ఐగా చల్లా వెంకట్రాజం బాధ్యతలు స్వీకరణ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా చల్లా వెంకట్రాజం నియమితులయ్యారు.ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించగా, ఇప్పటి వరకు పనిచేసిన ఎస్ఐ అంజయ్య బదిలీపై వెళ్ళారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ, "రూరల్ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటాం. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, వివాదాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందని,చట్టాన్ని అతిక్రమించే వారెవరైనా ఉపేక్షించబోమని,ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు సాధ్యమవుతాయని,ప్రజలు పోలీసులకు సహకరించాలి" అని పేర్కొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

- బీసీ సాధికారత సంఘం ఉమ్మడి జిల్లాధ్యక్షులు : పొలాస నరేందర్



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వెనుకబడిన కులాల ఉద్యమనేత,తెలంగాణ పక్షపాతి,స్వాతంత్ర్య సమరయోధుడు,మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ ఘనంగా నివాళులు అర్పించారు.దఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరం,నిజాం వ్యతిరేక పోరాటం,తెలంగాణ తొలి దశ ఉద్యమం,మలిదశ ఉద్యమాల్లో బాపూజీ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ కోసం తన పదవులు,ఆస్తులు ధారపోసిన ఆదర్శ నేతగా చరిత్రలో నిలిచారని,ఆయన పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని నరేందర్ అన్నారు.

## విశ్వబ్రాహ్మణ సామాజిక సమస్యలకు చైతన్యం దిశగా పుష్పగిరి పాదయాత్ర

- రాబోయే ఎన్నికల్లో విశ్వకర్మలకు 5 శాతం రిజర్వేషన్ తప్పనిసరి
- కరీంనగర్ కు "కర్మారనగర" పూర్వ వైభవం తేవాలి
- మహమ్మాయి ఆలయానికి రూ. 2.50 కోట్లు విడుదల చేయాలి
- విశ్వకర్మల ఆత్మహత్యలు - ఆకలి చావులు నివారించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి
- విశ్వబ్రాహ్మణ - విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షులు : పాములపర్తి వేణుగోపాల చారి



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** విశ్వబ్రాహ్మణ ఐక్యత కోసం విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి చేపట్టిన 1500 కి.మీ విశ్వబ్రాహ్మణ చైతన్య పాదయాత్ర శనివారం కరీంనగర్ చేరుకుంది. కమాన్ చౌరస్తా వద్ద విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పాములపర్తి వేణుగోపాల చారి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.పాదయాత్ర సందర్భంగా పుష్పగిరిని శాలువాతో సన్మానించి, విశ్వకర్మ జెండా ఆవిష్కరించారు. వందలాది మంది విశ్వకర్మ సోదరులు, సోదరీమణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పాములపర్తి వేణుగోపాల చారి మాట్లాడుతూ పలు డిమాండ్లను వెల్లడించారు.



### ప్రధాన డిమాండ్లు

- ఎలగందుల మహమ్మాయి దేవాలయం అభివృద్ధికి రూ.2.5 కోట్లు విడుదల చేయాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 5 శాతం రిజర్వేషన్ విశ్వకర్మలకు కల్పించాలి
- పేదరికం,ఆత్మహత్యలు నివారించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "ఒకప్పుడు కర్మారనగరంగా పేరుపొందిన కరీంనగర్ కీర్తి విశ్వకర్మల సొంతం. అయినప్పటికీ,నేడు రాజకీయంగా మాకు అన్యాయం జరుగుతోంది. ఇకపై విశ్వకర్మ వ్యతిరేక పార్టీల కుట్రలు సహించబోము" అని స్పష్టం చేశారు.వచ్చే ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ స్థానాన్ని విశ్వబ్రాహ్మణ మహిళకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు సామనపల్లి లక్ష్మీ శంకరాచారి,గంగాధర మండల అధ్యక్షులు పాములపర్తి రవీంద్ర చారి, అనసూరి మనోజ్ చారి, బొంపెల్లి లక్ష్మీనారాయణ చారి, వడపు ప్రసాద్ చారి, తదితరులు పాల్గొన్నారు.

# బాపూజీ స్ఫూర్తి ప్రతి రంగంలో కొనసాగించాలి

- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్
- జిల్లా కేంద్రంలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి మహేందర్ రెడ్డితో కలిసి బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య సమరయోధులు మాత్రమే కాక, ప్రజల హక్కుల కోసం అజరామరులుగా పోరాటం చేసిన మహానాయుడు. వారి స్ఫూర్తి మనమంతా ప్రతి రంగంలో కొనసాగించాలి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు,నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పండుగ రోజు కూడా పస్తులేనా.?

- గ్రామ సఫాయి కార్మికుల ఆవేదన



**ధర్పల్లి (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు ఇప్పించాలని ధర్పల్లి ఎంపీడీవో లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇచ్చిన సపాయి కార్మికులతో కలిసి వి బాలయ్య ఐ ఎఫ్ టి యు ధర్పల్లి మండలం గ్రామ పంచాయతీ కార్మికులకు సంబంధించి నెలకు 9500 వేతనం మూడు నెలలు నుండి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న జీతం అయినా మా జీతాలుమాకు సకాలంలో రాక, అవస్థ పడుతున్నాం. దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక ఖర్చులు ఉంటాయని అందువల్ల మా వేతన బకాయిలు ఇప్పించాలి మేము చేసే పని సఫాయిపని కిందిస్థాయి ఉద్యోగుల తక్కువ జీతం కే మా జీవితాలు అంకితం చేస్తున్నాం అయినా ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టం అదేవిధంగా దసరా పండుగ వస్తున్న సందర్భంగా మాకు మా పిల్లలకు కనీసం కొత్త బట్టలు కొనుక్కోవడానికి కూడా ఏమో గాని రోజు గడవడానికి గంటలు లెక్కిస్తున్నాం దయచేసి మా జీతాలు వెంటనే ఇప్పించలని మనవి చేస్తున్నాం. ప్రభుత్వం మాలాంటి చిన్న వేతనం ఉన్న వాళ్లకు ఇలా బకాయిలు పెండింగ్లో ఉంచడం భావ్యం కాదు. ఇప్పటికే చిన్నచిన్న అప్పులు చేసి కుటుంబాన్ని నడిపించుకుంటున్నం. పండుగకు వేతనాలు లేకపోతే మా కుటుంబంలో విషాదమే మా చుట్టూ ఉన్న కుటుంబాలు, వారి పిల్లలు పండుగ పూట కొత్త బట్టలు ధరించి ఆనందపడుతుండగా మా పిల్లలు బాధపడే పరిస్థితి ఏర్పడుతుంది. దయచేసి మా వేతనాల్ని ఎలాగైనా ఇప్పించుటకు ప్రయత్నించి మాకు సహకరిస్తారని కోరుకుంటున్నాం. మల్టీ పర్పస్ విధానం పేరుతో కార్మికులకు ఇబ్బంది కలుగుతుంది. దయచేసి జీవో నెంబర్ 51 మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాం.

# ప్రతి ఇంటికి ఆనందం

## ఐక్యతకు ప్రతీకలుగా బతుకమ్మ - దసరా పండుగలు

- జిల్లా ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ - దసరా పండుగ శుభాకాంక్షలు
- విశ్వబ్రాహ్మణ- విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లాధ్యక్షులు : పాములపర్తి వేణుగోపాల చారి



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మ ఐక్య సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పాములపర్తి వేణుగోపాలచారి జిల్లా ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బతుకమ్మ పండుగ మన సంస్కృతికి,ఐక్యతకు ప్రతీక.పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు కుటుంబసభ్యుల మధ్య అనుబంధాన్ని పెంపొందిస్తాయి. దసరా పండుగ కూడా సనాతన సంప్రదాయాలను నిలిపి,ప్రతీ ఇంటికి శాంతి,ఆనందం తీసుకువస్తుంది,విజయానికి ప్రతీకగా విజయదశమి దసరా పండుగ" అని అన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో విలసిల్లుతూ, ఆనందోత్సాలతో పండుగలు జరుపుకోవాలని ఆకాంక్షించి,సద్దుల బతుకమ్మ- దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నమికిగుండుపల్లిలో సద్దుల బతుకమ్మ సంబరాలకు మౌళిక సౌకర్యాలు కల్పించాలి

- బురద-చీకటితో మహిళల భద్రతకు సమస్యలు
- యుద్ధప్రాతిపదికన లైట్లు, బురద సమస్యలను పరిష్కరించాలి
- భాజపా రూరల్ మండల ఉపాధ్యక్షులు : గుంటి వంశీకృష్ణ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలం,నమిలిగుండుపల్లి గ్రామంలో బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు సంబరాలను నిర్వహించడానికి వెళ్లే రహదారిలో బురద,గుంతలు ఉండటం,లైట్లు లేకపోవడంతో చీకటిగా ఉండటం సమస్యగా మారింది. దీంతో పండుగను సౌకర్యవంతంగా,భద్రంగా జరుపుకోవడం మహిళలకు కష్టంగా,భయానకంగా మారింది.ఈ సమస్యపై భారతీయ జనతా పార్టీ వేములవాడ రూరల్ మండలఉపాధ్యక్షులు గుంటి వంశీకృష్ణ ఆవేదన వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచ్,గ్రామపాలక వర్గం లేకపోవడంతో గ్రామాభివృద్ధి వ్యవస్థ కుంటుపడిపోతోందని,గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ కార్యాదర్శులు గ్రామ మౌళిక సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారని అన్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు కనీసస్థాయిలో కూడా జరగకపోవడం బాధాకరమని అన్నారు.యుద్ధప్రాతిపదికన జిల్లా కలెక్టర్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చర్యలు తీసుకొని, నమిలిగుండుపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలను నిర్వహించేందుకు కనీస మౌళిక సౌకర్యాలు కల్పించి,మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని గుంటి వంశీకృష్ణ డిమాండ్ చేశారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- సీనియర్ నాయకులు చిన్న గండు రాజేందర్



**రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్)** ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నాయకులు చిన్న గండు రాజేందర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలో శనివారం సీనియర్ నాయకులు రాజేందర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని ఆశలకు అనుగుణంగా ఉండాల్సిన ప్రభుత్వం పథకాల అమలు చేయడంలో నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తుందన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలందరూ కూడా టిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి మరల రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలందరూ ఏకమై మరల కెసిఆర్ ముఖ్యమంత్రి కోసం ఆదర్శవంతమైన రాష్ట్రం కోసం కారు గుర్తుకు ఓటు వేసి విజయ డంకా మోగించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. మన తెలంగాణ బంగారు తెలంగాణ గా మారాలంటే కేవలం కెసిఆర్ సార్ తోనే సాధ్యమవుతుందని గుర్తుంచుకోవాలన్నారు.

# జిఎస్టి తగ్గింపుతో కోట్ల మందికి ప్రయోజనం



**నాచారం(ప్రశ్న న్యూస్)** నాచారం డివిజన్‌లో జీఎస్టీ అభియాన్ కార్యక్రమం లో భాగంగా నాచారం డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో జీఎస్టీ అభియాన్ జిల్లా సభ్యులు ప్రకాష్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల కోసం జీఎస్టీ సవరణలు చేసి ధరలు తగ్గించినందుకు ప్రధాని నరేంద్ర మోడీ కి కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు గోపాల్ గౌడ్, రాగిరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ సందర్భంగా బిజెపి నేతలు మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల జిఎస్టి తగ్గించడం వల్ల పేద మధ్య తరగతి వర్గాలకు మరింత లాభం చేకూరుతుందని అన్నారు.ఈ సంస్కరణలతో మోడీ పేద ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు అని అన్నారు. అనంతరం జిల్లా సభ్యులు ప్రకాష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పలు షాపులను సందర్శించి జీఎస్టీ సవరణలపై ప్రజల స్పందనను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులు అభిషేక్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్రమౌళి, ఉప్పల్ మహిళ కన్వీనర్ అనిత పద్మారెడ్డి, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శులు పాదం వెంకటేష్, ఉదయ్ కిరణ్ రెడ్డి, మహిళ మోర్చా అధ్యక్షురాలు మంజుల వాణి, యువమోర్చా నాయకులు బాలకృష్ణ, డివిజన్ బీజేపీ నాయకులు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, ఆనంద్ గుప్తా, రమేష్, శ్రీనివాస్ యాదవ్, దర్శనాల వెంకటేష్, మూల వెంకటేష్, వరలక్ష్మి, లావణ్య, పార్వతి, నారాయణ రెడ్డి, వెంకటేష్ బ్యాంకు, కిషోర్, బాల, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లలిత త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



**నాచారం(ప్రశ్న న్యూస్)** దేవి శరన్నవరాత్రుల సందర్భంగా నాచారం లోని శ్రీ మహంకాళి సహిత ఈశ్వరాలయంలో శ్రీ లలిత త్రిపుర సుందరి అవతారంలో దర్శనం ఇచ్చిన అమ్మవారికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ , చంద్రమౌళి, మోహన్ రెడ్డి, మల్కా ప్రకాష్, అభిషేక్ గౌడ్,రమేష్, ఉదయ్ రెడ్డి, వేణు గోపాల్, శేఖర్ గుప్త, వెంకటేష్, మూల వెంకటేష్, ఆనంద్ కుమార్,శ్రీనివాస్ యాదవ్, అనిత రెడ్డి, మంజుల వాణి,వరలక్ష్మి,కళావతి లావణ్య, పార్వతి, డివిజన్ బిజెపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేని వర్షం.. ఉప్పొంగుతున్న వాగులు

భూపాలపల్లి, : భూపాలపల్లి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జిల్లా వ్యాప్తంగా పలు వాగులు ఉప్పొంగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లోలెవల్ వంతెనల పైనుంచి వాగుల నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. మహాదేవపూర్ మండలం చంద్రపల్లి వాగు ఉద్ధృతి పెరగడంతో అన్నారం, నాగపల్లి, మద్దులపల్లి, పలుగుల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాటారం మండలం దామెరకుంట గుంద్రత్ పల్లి మధ్యలో అలుగు వాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచాయి. మహాదేవపూర్, కాటారం, పలిమేల, మలహార్, మహా ముత్తారం మండలాలలో భారీ వర్షం కురుస్తోంది.

## రిజర్వాయర్ నీటితో పంటలు నాశనం

జనగామ, : పర్వతగిరి మండల కేంద్రంలోని రిజర్వాయర్లో నీటి నిల్వ కోసం ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని తరలించడంతో లక్షలు ఖర్చు చేసి పంటలు వేశామని, తీరా నోటికాడికి వచ్చేసరికి పంట చేతికి అందకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ కింద ఉన్న భూములలో నీరు రావు అనుకొని పంటలు వేసుకున్నామని, ఇప్పుడు నీళ్లు వస్తే పంటలన్నీ ఆగమవుతాయని వెంటనే నీటిని నిలిపి వేయాలని రైతులు కోరుతున్నారు. రిజర్వాయర్ శిఖం పరిధిలో వందలాది మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారని, నెల రోజుల పాటు నీటి పంపింగ్ ఆపి వేస్తే పంటలు గట్టెక్కుతాయన్నారు.

## కాంగ్రెస్ నాయకుల పరామర్శ, మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

స్టేషన్‌ఘన్‌పూర్, : బచ్చన్నపేట మండల పరిధిలోని కట్కూర్ గ్రామానికి చెందిన గుడిసె రాజవ్వ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు పుట్ట నర్సింహులు, కాంగ్రెస్ కార్యకర్తలు శివ, వంశీ, శ్రీకాంత్, గణేష్ మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు శాఖ సరే.. అటవీశాఖ బదిలీల సంగతేంటి.?

## అటవీశాఖలో బదిలీలు ఉండవా.?

- ప్రకృతి సంపదను మింగేస్తున్న "స్థిర" అధికారులు
- సీఎంఓ స్థాయిలో అటవీ ఉన్నత అధికారుల పైరవీలు
- పోలీస్ శాఖ తరహాలో అటవీశాఖలో సైతం బదిలీలు చేపట్టాలి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో పోలీసు శాఖలో తరచూ బదిలీలు జరుగుతుండగా, అటవీశాఖలో మాత్రం ఆ విధానం పూర్తిగా బదిలీలు శూన్యం అనేది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ముఖ్యంగా జిల్లా అటవీశాఖ అధికారులు ముఖ్యమంత్రి పేషీ స్థాయిలో పైరవీలు చేస్తూ (డీ ఎఫ్ ఓ) చాలా ఏళ్లుగా ఒకే ప్రాంతంలో కొనసాగుతుండటంతో స్థానిక రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు,మాఫియాతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొని తమ స్వప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. అటవీ శాఖలో అధికారుల, సిబ్బంది బదిలీలను పూర్తిగా ప్రభుత్వం మరిచిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి.

### పోలీసులతో పోలిస్తే అటవీశాఖలో నిర్లక్ష్యం..

పోలీస్ శాఖలో ఒకే ప్రాంతంలో ఎక్కువ కాలం కొనసాగకుండా తరచుగా బదిలీలు చేస్తారు. ఈ విధానం వల్ల స్థానిక సంబంధాలు ఏర్పడి అవినీతి, అక్రమాలకు అవకాశం తగ్గుతుందని భావిస్తారు. కానీ అటవీశాఖలో ఈ తరహా జాగ్రత్తలు లేకపోవడంతో అధికారులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా మారింది. కొంతమంది దొంగచాటుగా చెట్ల నరికి తరలింపులు, ఇసుక మాఫియా, భూస్వాధీనం వంటి అనేక అక్రమాలకు అటవీ అధికారుల మౌన సహకారం లభిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

### అక్రమాలకు అడ్డా అవుతున్న అడవులు..

రాజన్న సిరిసిల్ల,ములుగు, అచ్చంపేట, ఖమ్మం,ఆదిలాబాద్ జిల్లాల్లో అటవీ సంపద కొల్లగొట్టబడుతున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. కాంట్రాక్టర్లతో చేతులు కలిపిన అధికారులు, స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అడవులను రక్షించాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారని స్థానిక ప్రజలు గోస పడుతున్నారు. బదిలీలు జరగకపోవడం వల్ల అధికారులకు స్థానిక పరిచయాలు బలపడుతూ, వారే లాభదాయక ఒప్పందాల్లో భాగస్వాములు అవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

### పర్యావరణానికి పెరుగుతున్న ముప్పు..

అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల వందల ఎకరాల్లో చెట్లు అక్రమంగా నరికివేయబడ్డాయి. పర్యావరణ సమతుల్యతకు ఇది పెద్ద ముప్పుగా మారింది. వన్యప్రాణులు నివాస స్థలాలు కోల్పోతూ, గ్రామీణ ప్రజలు తాగునీటి, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నారు. తక్షణమే సంస్కరణలు చేయకపోతే రాష్ట్రం పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### రాజకీయ, మాఫియా ఒత్తిళ్లు..

ఒకే ప్రాంతంలో ఎక్కువకాలం కొనసాగుతున్న డీఎఫ్ఓలు స్థానిక రాజకీయ నేతలతో సన్నిహితమై,వనరుల దోపిడీకి కళ్ళుమూస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. కొంతమంది అధికారులపై అక్రమ ఇసుక రవాణా,భూముల ఆక్రమణలో మౌన సహకారం ఉన్నట్టు ఆరోపణలు వచ్చినా, బదిలీలు జరగకపోవడం వల్ల ఆ వ్యవస్థ కొనసాగుతూనే ఉందని తెలుస్తోంది. అటవీశాఖ అధికారుల బదిలీలపై ప్రభుత్వం మనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### నిపుణుల సూచనలు..

పర్యావరణ పరిరక్షణ నిపుణులు, మాజీ అటవీ అధికారులు మాత్రం కఠినమైన బదిలీ విధానాన్ని అమలు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సలహా ఇస్తున్నారు. "పోలీస్ శాఖలోలాగా అటవీశాఖలోనూ అధికారులు తరచూ బదిలీలు అవుతూ ఉంటే, స్థానిక మాఫియా%-%అధికారుల సంబంధాలు కుదరక, అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది" అని వారి అభిప్రాయం.

### ప్రజల ఆవశ్యక డిమాండ్..

ప్రజలు అడవులను రక్షించే అటవీశాఖను అవినీతి కేంద్రంగా కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడిన శాఖగా చూడాలని కోరుతున్నారు. అందుకోసం ప్రభుత్వం వెంటనే అటవీశాఖలో విస్తృత బదిలీలను చేపట్టాలని, బదిలీలకు కఠినమైన విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

# వెలగని వీధిలైట్లు..

## అంధకారంలో కేఎల్లార్ ఫేజ్ 2

- చీకట్లలోనే బతుకమ్మను తీసుకెళ్లిన మహిళలు
- పట్టించుకోని పురపాలక సంఘం అధికారులు
- వీధిలైట్లను వేయాలని కోరుతున్న స్థానికులు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** అధికారుల నిర్లక్ష్యంతో మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని కేఎల్ఆర్ ఫేజ్ 2లో రోడ్డు నెంబర్ ఒకటి నుంచి రోడ్డు నెంబర్ 12 వరకు వీధిలైట్లు వెలగకపోవడంతో ఆడపడుచులు చీకట్లలోనే బతుకమ్మలు ఆడాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళలకు సంబంధించింది కావడంతో వారి గోడు వినే అధికారి, ప్రజా ప్రతినిధి కరువయ్యారు. బతుకమ్మలు చీకటిలోనే ఆడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వీధిలైట్లు ఏర్పాటు చేయడంలో అధికారులు చేతులెత్తేస్తుండడంతో సమస్య ఎక్కడ పరిష్కారమవుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని మహిళలు, స్థానిక ప్రజలు కోరారు.

# అభివృద్ధి పనులను దగ్గరుండి చేపిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

- మాకు కావలసిన కమిషన్ వచ్చిందా.? అనే కార్పొరేటర్లే ఎక్కువ
- అభివృద్ధి పనులను దగ్గరుండి పర్యవేక్షించే కార్పొరేటర్లు లేక నాణ్యతకు తిలోదకాలు
- మహిళా కార్పొరేటర్లతోనే గ్రేటర్ హైదరాబాదులో అభివృద్ధి కుంటుపడిందా.?
- కార్పొరేటర్ గా గెలిచారు ఇంటికి పరిమితమయ్యారు, పర్యవేక్షణ అంతా షాడోలదే



**కాప్రా (ప్రశ్నా న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అభివృద్ధి పనులను కార్పొరేటర్లు దగ్గర ఉండి పనులు చేయించడం అతి స్వల్పంగా చూస్తుంటాము. ప్రజలకు సేవ చేయాలన్న చిత్తశుద్ధి ఉన్న కొంతమంది కార్పొరేటర్లు మాత్రమే ఇలా దగ్గరుండి అభివృద్ధి పనులను చేపిస్తారు, పర్యవేక్షిస్తారు అందులో మీర్పేట హెచ్ బి కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ ముందున్నారు. చాలావరకు కార్పొరేటర్లు అభివృద్ధి పనుల్లో తమకు రావలసిన కమిషన్ తీసుకొని పనులు ఎలా చేసినా మాకు సంబంధం లేదంటూ అటువైపు కన్నెత్తి చూడరు. అందుకోసమే జిహెచ్ఎంసి పరిధిలో అభివృద్ధి పనులకు అసలు నాణ్యత అనేది లేకుండా పోయింది. అయితే మీర్పేట్ హెచ్ బి కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ ఇలా దగ్గరుండి పనులు చేయించడం పై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సమస్యను కార్పొరేటర్ స్వయంగా పర్యవేక్షించి దగ్గరుండి చేయిస్తారని స్థానికులు అభినందించారు.

# రేవంత్ మాటే..రైట్

## - మూసీ నది పునరుజ్జీవం చేయక తప్పదా.?
## - కబ్జాలతో కుషించుకుపోయిన మూసి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ లో కురిసిన భారీ వర్షానికి మూసీ ఉప్పొంగి ప్రవహించింది. శనివారం రాత్రి కూడా వర్షపు నీటితో మూసీ, ఈసీ నదులు ఉప్పొంగి ప్రవహించే అవకాశాలున్నాయని అంచనా వేసింది. ఈ మేరకు అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. వికారాబాద్ లో భారీ వర్షం పడుతుండటంతో మూసీ, ఈసీ నదులు శనివారం రాత్రి ఉప్పొంగి ప్రవహించే అవకాశముందని కూడా అధికారులు చెప్పారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మూసీ నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని కాలనీలు నీట మునిగాయి.దీంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నిన్న కురిసిన భారీ వర్షాలతో నగరం అతలాకుతలమైంది. మూసీ నది ఉధృతంగా ప్రవహించడంతో పలు లోతట్టు కాలనీలు మునిగిపోయాయి.

### నీట మునిగిన నగరం

వీధులు, ప్రధాన రహదారులు నీటమునిగిపోయి రాకపోకలు దాదాపు ఆగిపోయాయి. మూసారాంబాగ్ బ్రిడ్జి, చాదర్ ఘాట్ వంతెన పై నుంచి ఆరడుగుల మేర నీరు ప్రవహించింది. అలాగే మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్)లోనూ నీరు చేరింది. పరిసరాలు పూర్తిగా మునిగిపోవడంతో బస్ సర్వీసులను నిలిపివేయాల్సి వచ్చింది. ప్రయాణికుల కోసం ఎక్కే ప్రదేశాలను అధికారులు మార్చారు. గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు నేడు చూడాల్సి వచ్చింది. ప్రభుత్వ యంత్రాంగం, హైడ్రా బృందాలు కలసి మునిగిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాయి. వర్షపాతం ఇంకా కొనసాగుతుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. అదృష్ట వశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు. ఆస్తినష్టం బాగానే జరిగినట్లు తెలిసింది.

### మూసీ నది ఆక్రమణలపై..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే మూసీ పునరుజ్జీవం పథకంపై మాట్లాడుతున్నారు. దీనికి అనేక రాజకీయ పార్టీలు అభ్యంతరం తెలుపుతున్నాయి. మూసీ పునరజ్జీవ ప్రాజెక్టు అవసరాన్ని నిన్నటి కురిని వర్ష బీభత్సం కళ్లకు కట్టినట్లు చూపించింది. ఇలాగే మరికొన్నేళ్లు ఉంటే నగరం ఖచ్చితంగా నీటిలో మునుగుతుందన్న ఆందోళన ప్రతి ఒక్కరిలోనూ బయలుదేరింది. నగరంలో ఎక్కడ చూసినా నీరు చేరింది. అలాగే మూసీ ఒడ్డున ఉన్న అనేక ఆక్రమణలను తొలగించాల్సిన అవసరాన్ని ఇప్పుడు అందరూ గుర్తించాల్సి ఉంటుంది. ఎందుకంటే రానున్న కాలంలో ఉష్ణోగ్రతలు ఏ స్థాయిలో ఉంటాయో, వర్షాలు కూడా అదే స్థాయిలో ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఇప్పటికైనా ప్రభుత్వానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలన్న వాదనలు మొదలయ్యాయి.

# శాంతిభద్రతల విషయంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానం

- హైదరాబాద్ అంటే ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ అన్న రేవంత్ రెడ్డి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించి, ఇది అత్యంత సురక్షితమైన నగరమని నిరూపించామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో రక్షణ, శాంతిభద్రతల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని, శాంతిభద్రతల విషయంలో దేశంలోనే హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని కేంద్రం ప్రకటించిందని ఆయన తెలిపారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కొత్త టూరిజం పాలసీని తీసుకువచ్చినట్లు తెలిపారు. గోల్కొండ, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలు హైదరాబాద్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎకో, మెడికల్, హెల్త్ టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. హైదరాబాద్ అంటే ఓల్డ్ సిటీ కాదని, ఒరిజినల్ సిటీ అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ ప్రఖ్యాత నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోందని ఆయన అన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# టౌన్ ప్లానింగ్‌లో విచ్చలవిడిగా లంచాల దందా

- ఏసీబీ అధికారులకు చిక్కిన రాధాకృష్ణారెడ్డి
- రూ. 3 లక్షల 50 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- హెచ్ఎండిఏ అనుమతి ఉన్న లంచం కోసం బెదిరించిన వైనం
- వివరాలు వెల్లడించిన అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ గంగసాని శ్రీధర్


అవినీతి నిరోధక శాఖ అధికారులు పేర్కొన్నారు.

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మున్సిపల్ శాఖలో అవినీతి తీవ్రస్థాయికి చేరింది అందులో ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ భాగంలో హద్దు అదుపు లేకుండా సిబ్బంది అధికారులు భారీగా లంచాలు తీసుకోవడం పరిపాటిగా మారింది దొరికితే దొంగ దొరకకుంటే దొర అన్నట్లుగా మారింది టౌన్ ప్లానింగ్ పరిస్థితి. చిన్న దానికి కూడా లక్షలలో వసూలు చేస్తున్నారు టౌన్ ప్లానింగ్ అధికారులు దానితో ఒక్కొక్క అధికారి సిబ్బంది కోట్లకు అక్రమ సొమ్ముతో పడగలెత్తారు. వీళ్లపై ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని ఫిర్యాదులు చేసిన ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకోవాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.బాధ్యత గల హోదాలో ఉండి తప్పు జరిగే చోట తప్పును సరిదిద్దేలా చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన అధికారి చట్టానికి విరుద్ధంగా రూ.3 లక్షల 50 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఎల్లంపేట పురపాలక సంఘం ఇన్చార్జి టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణ రెడ్డి శనివారం ఉదయం పట్టుపడ్డాడు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఎల్లంపేట పురపాలక సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని ఓ వెంచర్ కు హెచ్ఎండిఏ అనుమతులు ఉన్నప్పటికీ వెంచర్ నిర్వాహకులు వెంచర్ చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడలు కూల్చకుండా ఉండటానికి టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణారెడ్డి సంబంధిత వెంచర్ నిర్వాహకుల వద్ద నుంచి రూ. 5 లక్షలు ఇవ్వాలని, లేదంటే ప్రహరీ గోడలు, మెయిన్ గేట్ కూల్చివేస్తానని తెలపడంతో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణారెడ్డికి వెంచర్ నిర్వాహకులు ముందస్తుగా రూ. లక్ష ఇవ్వగా మిగిలిన రూ. నాలుగు లక్షల విషయంలో వెంచర్ నిర్వాహకులు గురువారం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో శనివారం ఉదయం కొంపల్లిలోని రాధాకృష్ణారెడ్డి ఇంటి సమీపంలో ఉన్న రాయచందిని మహల్ వద్ద రూ.3 లక్షల 50 వేల నగదును కారులో వచ్చిన టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణ రెడ్డి తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. అనంతరం రాధాకృష్ణ రెడ్డి ఎడమ చేతికి ఫినోఫ్తలిన్ పరీక్ష నిర్వహించగా పాజిటివ్ రావడంతో లంచం తీసుకున్నట్లు నిర్ధారణ కాగా సదరు అధికారిని ఎల్లంపేట పురపాలక సంఘం కార్యాలయానికి తీసుకొచ్చి విచారించిన అనంతరం లంచం తీసుకున్న అధికారి కారు సీజ్ చేసినట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు పేర్కొన్నారు.

### ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగితే కాల్ చేయండి..

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలను లంచం డిమాండ్ చేసినా, వేధించినా వెంటనే డయల్ 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ గంగసాని శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఎల్లంపేట పురపాలక సంఘం కార్యాలయంలో లంచం ఇవ్వకండి మాకు సమాచారం ఇవ్వండి అనే పోస్టర్ను కార్యాలయ భవనానికి అతికించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588